ప్రజాశక్తి

శనివారం 26 ఏప్రిల్ 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు

విజిలెన్స్ ప్రేక్షకపాత్ర

ఆటోలో తరలుతున్న రేషన్ బియ్యం (ఫైల్)

- రేషన్ మాఫియాపై సిఎం సీరియస్
- ఒంగోలులో టిడిపి నాయకుని హత్యతో కదులుతున్న డొంక
- ఈజీగా డబ్బు సంపాదించి నేరాలకు పాల్పడుతున్నారని నిఘా నివేదికలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఉమ్మడి గుంటూరు జిల్లాలో రేషన్ అక్రమ రవాణాను నియంత్రించాల్సిన ప్రభుత్వ శాఖలన్నీ ప్రేక్షకపాత్ర పోషిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రేషన్ బియ్యం ద్వారా రూ.కోట్లు దండుకుంటున్న మాఫియా ముఠాలు తమకు సహకరించని, ఎదురుతిరిగిన వారిని మట్టుబెట్టేందుకు వెనుకాడటంలేదన్న వార్తలు వస్తున్నాయి. గతప్రభుత్వ హయాంలో పొన్నూరులో జరిగిన బర్నబాబు హత్య, కొద్ది రోజుల క్రిందట ఒంగోలులో టిడిపి నాయకుడు వీరయ్య చౌదరి హత్య వెనుక రేషన్ మాఫియా ఉన్నట్టు వార్తలు రావడంతో ప్రభుత్వం ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నట్టు తెలిసింది. వెంటనే ప్రత్యేక బృందాలను పంపి ఆకస్మిక తనిఖీలు చేసి అక్రమదార్కులు, మాఫియా బృందాలను కట్టడి చేయాలని, వారిపై పీడీ యాక్టు అమలు చేయాలని సిఎం చంద్రబాబు అధికారులకు సూచించినట్టు తెలిసింది. వచ్చేనెలలో ప్రధాని పర్యటన ముగిసిన తరువాత అధికార యంత్రాంగం ఈ అంశంపై దృష్టి సారించే అవకాశాలు ఉన్నట్టు తెలుస్తోంది.

గత ప్రభుత్వంలో రేషన్ మాఫియాలో కీలక భూమిక పోషించిన వైసిపికి చెందిన వారే కూటమి ప్రభుత్వంలో కూడా తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం మారడమే తప్ప వివిధ రకాల వ్యవస్థల్లో మార్పులు లేవు. గత ప్రభుత్వంలో కంటే కూటమి ప్రభుత్వం రేషన్ మాఫియా మరింత రెచ్చిపోతోంది. రేషన్ మాఫియాపై పీడీ యాక్టు పెట్టాలన్న ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం అయ్యాయి. పేదలకు పంపిణీ చేయాల్సిన రేషన్ బియ్యంను యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నా పట్టించుకునే వారు లేరు. గత ప్రభుత్వంలో అడపాదడపా దాడులు జరిగేవి. ఇప్పుడు ఏ శాఖ అధికారులూ పట్టించుకోవడం లేదు. తాజా పరిణామాలపై నివేదికలు తెప్పించుకున్న సిఎం చంద్రబాబు గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా కట్టడిపై సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది. ప్రధానంగా విజిలెన్సు అధికారులు ఏమాత్రమూ నియంత్రించలేకపోతున్నారని నివేదికలు వెళ్లినట్టు విశ్వసనీయంగా తెలిసింది. గత ప్రభుత్వంలో రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసిన వారే ఇప్పుడు కూడా ప్రస్తుత ఎమ్మెల్యేలను మ్యానేజ్ చేసుకుని రెచ్చిపోతున్నారని వివిధ ఏజెన్సీల నుంచి సిఎంకు నివేదికలు వెళ్లినట్టు తెలిసింది.

గుంటూరులో ఎండియు వాహనాల ద్వారా ఇతర వాహనాలకు బియ్యం బస్తాలను మళ్లించేందుకు నగరంలో పలు స్థావరాలను ఎంపిక చేసుకున్నారు. ఈ ప్రాంతాల నుంచి ప్రతి నెల ఒకటో తేదీ నుంచి 20వ తేదీ మధ్య రహస్యంగా బియ్యం తరలిపోతున్నాయి. సరుకులు అందించే రేషన్ వాహనాల

▶ 2లో

గుంటూరులో సిపిఎం కార్యాలయం వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

పహల్గామ్‌లో ఉగ్రదాడులు అమానుషం

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో సిపిఎం కొవ్వొత్తుల ప్రదర్శనలు - మృతులకు నివాళి

ప్రజాశక్తి-గుంటూరు

పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చేజర్లలో ప్రదర్శన చేస్తున్న సిపిఎం శ్రేణులు

కాశ్మీర్‌లోని పహల్గామ్ ఉగ్రదాడులకు నిరసనగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ప్రదర్శనలు చేపట్టారు. ఇందులో భాగంగా గుంటూరు బ్రాడీపేటలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలపడంతోపాటు మృతులకు నివాళులు అర్పించి, వారి కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు, నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ పర్యాటకులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపి 28 మందిని అమానుషంగా చంపటం దుర్మార్గమన్నారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. పర్యాటకులకు భద్రత కల్పించటంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం కనిపిస్తోందని చెప్పారు. ఇలాంటి సమయంలో ఐక్యంగా ఉగ్రవాద శక్తులు పాల్పడే చర్యలకు వ్యతిరేకంగా అందరూ ఖండించాలని అన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసి యూనియన్ నాయకులు వివికె.సురేష్, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు షేక్.అబ్దుల్ సలీం, జెవివి నాయకులు జి.వెంకటరావు, ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి మాట్లాడారు. ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ బాషా, ఖాశిం వలి, బి సత్యనారాయణ, షేక్ ఖాశిం షహీద్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని సంఘ కార్యాలయం నుండి లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉగ్రదాడిలో మరణించిన వారికి కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ అన్ని మతాల సారం సాటి మతాలను ప్రేమించటమేనని, ఇటువంటి దాడులు సరికాదని అన్నారు. ఉగ్రవాదం, మతోన్మాదం నశించాలన్నారు.

▶ 2లో

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎవి నాగేశ్వరరావు తదితరులు

మేడే సాంస్కృతిక, క్రీడా ఉత్సవాలను జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు

సిఐటియు ఆధ్వర్యంలో నాగార్జున వర్సిటీలో క్రికెట్ పోటీలు ప్రారంభం

8 లో

పిఎఫ్ ప్రాంతీయ ధర్నా చేస్తున్న ఆర్‌టిసి పెన్షనర్లు

పిఎఫ్ కార్యాలయం వద్ద ఆర్‌టిసి పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి - గుంటూరు

ఎపిఎస్ ఆర్‌టిసి పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోరుతూ హై పెన్షన్ దరఖాస్తులను స్వీకరించాలని, కనీస పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుంటూరు కృష్ణనగర్‌లోని పెన్షన్ ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా చేసి కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. కృష్ణా, గుంటూరు ప్రకాశం జిల్లాల నుండి పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్న ధర్నాలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల గంగాధరరావు మాట్లాడారు. కార్మిక ఉద్యోగ పెన్షనర్లకు వ్యతిరేకంగా తీసుకుంటున్న ప్రావిడెంట్ ఫండ్ చర్యల్ని ప్రతి ఒక్కరూ అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్మికుల ఉద్యోగ విరమణ నాటికి ఉన్న జీతాన్ని బట్టి పెన్షన్ ఇవ్వాల్సి ఉందన్నారు. అంతే కాకుండా ఆర్‌టిసి పెన్షనర్ల కోసం ఉన్న ఆర్‌టిసి వైద్యశాలలో సరైన సౌకర్యాలు లేవని, దూర ప్రాంత ప్రయాణంలో కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని కోరారు. పెన్షన్ అంశంలో కోర్టు తీర్పును రద్దు చేశారని గుర్తు చేశారు. కరువు భత్యం, వేతన ఒప్పందాలను ఇపిఎస్‌లో లింకు చేయాలని కోరారు. కార్యక్రమంలో దశరథరామిరెడ్డి, కె.కోటేశ్వరరావు, సత్యవతి, హరిప్రసాద్, రవిశంకర్, శేషగిరిరావు, ఆనందరావు, మస్తాన్‌రావు ఆదినారాయణ, బాషాఖాన్, నాంచారయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పుట్టినరోజ ఫ్లెక్సీ వివాదం

టిడిపి నాయకునిపై అదే పార్టీవారి దాడి

ప్రజాశక్తి - వెల్దుర్తి

క్షతగాత్రుడు ఉప్పుతోళ్ల శ్రీనివాసరావు

ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల విషయంలో వచ్చిన విభేదాలు అదే పార్టీలోని ఒకరిపై దాడికి దారితీసింది. వెల్దుర్తి మండలం గుండ్లపాడులో శుక్రవారం జరిగిన ఘటనపై వివరాల ప్రకారం.. ఈనెల 18న మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పుట్టినరోజు సందర్భంగా గ్రామానికి చెందిన ఉప్పుతోళ్ల శ్రీనివాసరావు గ్రామంలోని పలుచోట్ల ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. అయితే మా ఇళ్ల వద్ద నీ ఫ్లెక్సీలు ఏమిటని టిడిపికే చెందిన కొందరు

▶ 2లో

మేయర్ ఎన్నికపై టిడిపి రహస్య భేటి

- 26 మంది కార్పొరేటర్ల హాజరు
- వ్యక్తిగత కారణాలతో ముగ్గురు గైర్హాజరు
- తమ బలం 33 అంటున్న నేతలు

7 లో

రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - తెనాలి

పక్షవాతంతో బాధపడుతున్న రోగి కుటుంబాన్ని ఆదుకునేందుకు స్థానిక మారిసుపేటకు చెందిన సౌపాటి కిరణ్ మిత్ర బృందం స్పందించింది. మండల పరిధిలోని మల్లెపాడు శాంతినగర్‌కు చెందిన పోలుమట్ల చంటి గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో కుటుంబం కూడా ఆర్థికంగా చితికిపోయింది. విషయం తెలుసుకున్న సౌపాటి కిరణ్ తన మిత్రబృందంతో కలిసి శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. వారికి రూ.10 వేల నగదు, నిత్యావసరాలను అందించారు. కార్యక్రమంలో చిలకా కిరణ్, అత్తోట ప్రసాద్, విజుమూరి ఏసు రాజు, దొప్పలపూడి శ్యామ్, రావూరి ఆనంద్ పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారిగా శ్రీనివాసరావు

ప్రజాశక్తి పెదకూరపాడు

పెదకూరపాడు మండల ప్రత్యేక అధికారిగా కట్టా శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన జిల్లా లేబర్ అధికారిగా ఉన్నారు. ప్రస్తుతం ఇప్పటివరకు ప్రత్యేక అధికారిగా పనిచేసిన ధనలక్ష్మి బదిలీపై విజయవాడ లేబర్ ఆఫీస్ కి వెళ్లారు. శ్రీనివాసరావును ఎండిఓ సోమయాజులు ఇతర అధికారులు సిబ్బంది స్వాగతం పలికారు.

విఐటిలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయంలో ఈనెల 28న జరిగే పలు కార్యక్రమాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాల్గొననున్నారు. ముందుగా మహాత్మా గాంధీ బ్లాక్(సెంట్రల్ బ్లాక్)ను ఆయన ప్రారంభిస్తారు.ఈ నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి శుక్రవారం రాత్రి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఎస్ వి కోటా రెడ్డి,సంయుక్త కలెక్టర్ ఎ భార్గవ్ తేజ, యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్, ముదిగంటి, ఆర్డీవో కె శ్రీనివాసరావు పరిశీలనలో ఉన్నారు.

గత ప్రభుత్వ పాలనలో వ్యవస్థలు అస్తవ్యస్తం

పల్లె నిద్రలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గత ప్రభుత్వ హయాంలో అన్ని వ్యవస్థలు అస్తవ్యస్తమయ్యాయని కూటమి ప్రభుత్వం ఆ వ్యవస్థలను గాడిలో పెడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. రొంపిచర్ల మండలం తురుమెళ్ళ గ్రామంలో గురువారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. మండల పార్టీ అధ్యక్షులు పులుకూరి జగ్గయ్య, ప్రధాన కార్యదర్శి పల్లెల నాగిరెడ్డి, ఎం.ఎ.ఎం విద్యా సంస్థల అధినేత మేదరమెట్ల రామ శేషగిరిరావు ల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడకు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో టిడిపి నాయకులు, కార్యకర్తలపై ఎన్నో దాడులు జరిగాయని అక్రమ కేసులు బనాయించారన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేయటం, రాష్ట్రాభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి మెమోరియల్ స్మారక ఫార్మసీ కళాశాలకు అటానమస్ హోదా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

విద్యా ప్రామాణికత, పరిశోధనలలో నాణ్యత, విద్యార్థుల విజ్ఞానాభివృద్ధికి చేసిన కృషి ఫలితంగా మండలంలోని ఏఎంరెడ్డి మెమోరియల్ స్మారక ఫార్మసీ కళాశాల అటానమస్ హోదా పొందినట్లు కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) సంబంధిత యూనివర్సిటీ నిబంధనల ప్రకారం మంజూరు చేశారన్నారు. ఏఎం ఫార్మసీ కళాశాల 20 ఏళ్లు పూర్తి చేసుకుందన్నారు. తమ బోధనా సిబ్బంది, విద్యార్థులు, పాలక మండలి, తల్లిదండ్రుల కృషి ఫలితమేనని పేర్కొన్నారు. అటానోమస్ హోదాతో ఇంకా మెరుగైన విద్యా ప్రమాణాలను అందిస్తామన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భార్గవ్ భూషణ్ మాట్లాడుతూ ఫార్మసీ కళాశాలకు అటానమస్ కోసం యాజమాన్యం చేసిన కృషి బోధన సిబ్బంది బోధనేతర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. అకాడమిక్ డీన్ డాక్టర్ సురేఖ మాట్లాడుతూ అటానమస్ రావడం వలన పరిశ్రమలకు తగినట్టుగా విద్యార్థులను మార్చవచ్చని ఫార్మసీ రంగం రానున్న రోజులలో మార్పులు జరుగుతాయన్నారు.

పహల్గామ్‌లో ఉగ్రదాడులు అమానుషం

సత్తెనపల్లిలో..

తాడేపల్లిలో..

ముప్పాళ్ల మండలం మాదలలో



ఫిరంగిపురం మండలం పొనుగుపాడులో

సత్తెనపల్లి మండలం ఫణిదంలో

గుంటూరులో

తాడేపల్లి మండలం కుంచనపల్లిలో..

(మొదటి పేజీ తరువాయి)

యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సి.హెచ్.ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, ఎమ్‌డి.షకీలాబేగం, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్

కుంచనపల్లిలో సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ చేశారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నిరసనకు ఎన్.కిషోర్‌బాబు అధ్యక్షత వహించగా సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ భద్రతా వైఫల్యం కారణంగా జరిగిన దాడిని ఏ ఒక్క మతానికో పులమకుండా దాడికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని అన్నారు. 370 ఆర్టికల్ రద్దు తర్వాత కేంద్ర ప్రభుత్వం జమ్మూ కాశ్మీర్లో రాష్ట్రం హక్కును హరించే విధంగా వ్యవహరించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. సిపిఎం మండల కార్యదర్శి పి.కృష్ణ, ఎ.రంగారావు, కె.వెంకటేశ్వరరావు, ఎ.సుధాకర్, టి.శ్రీనివాసరావు, కె.పెద్ద వెంకటేశ్వరరావు, రవికిషోర్, మస్తాన్, కె.శ్రీనివాసరావు, కె.యశోద, మహేష్, గుణశేఖర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి- తాడేపల్లి

బోసుబొమ్మ సెంటర్, సుందరయ్య నగర్‌లో సిపిఎం నిరసన ప్రదర్శన చేపట్టగా నాయకులు వి.దుర్గారావు, ఎస్.గిరిజ మాటాడుతూ ఉగ్రవాదానికి కులం, మతం అడ్డ రావని, అయితే దీన్నికూడా బిజెపి తన సోషల్ మీడియా ద్వారా మతం రంగు పులుముతోందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.50 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటరెడ్డి, కె.మేరీ, ఎమ్‌డి బాజ్జి, బి.దశరథరామిరెడ్డి, బి.గోపిరెడ్డి, కె.బాబురావు, ఎన్.దుర్గారావు, ఆర్వి రాఘవయ్య, ఐ.ఇసాక్, పి.లక్ష్మణరావు బి.రామారావు, కె.ప్రభాకర్‌రావు, కొండ బాబు, డాన్స్ మాస్టర్ చందు, బాష, కె.విజయలక్ష్మి, రమ, బుల్లెమ్మాయి, జ్యోతి, భ్రమరాంబ, అంజలి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలోని చేజర్లలో సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక పీర్ల సావిడి నుంచి బొడ్రాయి సెంటర్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ, మండల కార్యదర్శి జి.పిచ్చారావు, లక్ష్మారెడ్డి అప్పిరెడ్డి, రామాంజనేయ నాయక్, ఆవుల వెంకటేశ్వర్లు, దుర్గాబాయి, షేక్ దాదాసాహెబ్, నవాబ్ షరీఫ్, బాలమ్మబాయ్, కొండా నాయక్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

స్థానిక సిపిఎం కార్యాలయం నుండి తాలూకా సెంటర్లోని అంబేద్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన జరిగింది. సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య మాట్లాడుతూ ఆర్టికల్ 370 రద్దు సందర్భంగా ఉగ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించడానికి జమ్మూ కాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా చేస్తున్నట్లు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రకటించిందని, వారిప్పుడు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. సామాన్యులు, పర్యాటకులు లక్ష్యంగా గతంలో దాడులు జరగలేదని అన్నారు. కార్యక్రమంలో కె.శివదుర్గారావు, ఎం.హరిపోతురాజు, జె.రాజ్‌కుమార్, ఎ.వెంకటనారాయణ, పి.రామారావు, ఎస్.వెంకటేశ్వర్లు, జె.స్పందన, షేక్ సైదులు, మస్తాన్‌వలి, పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మండలంలోని ఫణిదంలో సిపిఎం కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేసింది. నాయకులు వి.తులసీరామ్, ఆర్.పూర్ణచంద్రరావు, వెంకటేశ్వర్లు, రాజు, సాయి పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని మాదల గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. సిపిఎం మండల కార్యదర్శి జి.బాలకృష్ణ మాట్లాడారు. ఈ ఘటనకు మతం రంగు పులిమేందుకు బిజెపి యత్నిస్తోందని, అయితే 26 మంది మృతి చెందగా వారిలో 15 మంది ముస్లిములనే విషయాన్ని విస్మరించరాదని ప్రజలను కోరారు. నాయకులు జి.జాలయ్య, కె.సాంబశివరావు, పి.సైదాఖాన్, ఎం.వెంకటరెడ్డి, కె.నాగేశ్వరరావు, సిహెచ్.నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - ఫిరంగిపురం

మండలంలోని పొనుగుపాడులో సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. సిపిఎం మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి మాట్లాడారు. కె.శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్, కె.కోటేశ్వరరావు, ఇ.నాగేశ్వరరావు, డి.సాయి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-ఈపూరు : ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న పనులను రైతులు సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ ఈదర రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం నందు శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఎంపీడీవో కె ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో జడ్పిటిసి చౌడయ్య మాట్లాడుతూ కాలువలకు సాగునీరు వచ్చేలోగా పంట కాలువలను బాగు చేయాలని అధికారులకు సూచించారు. ఏపీవో పుష్పరాజ్ ఉపాధి హామీ పథకం ద్వారా పంట కాలువలను పునరుద్ధరించడం, సేద్యపు నీటి కుంటలు, చెరువులు, కుంటలను అభివృద్ధి పరచడం కార్యక్రమాలు జరుగుతున్నాయని ఈ పనుల ద్వారా రైతుల వ్యవసాయ అవసరాలు తీరుతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మండలంలో తాగునీటి సమస్యలు ఉంటే వెంటనే ప్రజా ప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకురావాలని పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడతామన్నారు. ఈఈపిఆర్డి ఎన్ రత్నం, వైస్ ఎంపీపీ గోలి భాగ్యలక్ష్మి, మండల అధికారులు, గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రధాని సభకు 120 బస్సులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : ప్రజా రాజధాని అమరావతి నిర్మించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఆంధ్రుడిపై ఉందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట మున్సిపల్ అతిథి గృహంలో మున్సిపల్, సచివాలయ అధికారులతో సమీక్షించారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ వచ్చే నెల 2న జరగనున్న అమరావతి రాజధాని నిర్మాణ శంకు స్థాపనకు నియోజకవర్గం నుండి ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. నరసరావుపేట నియోజకవర్గం నుంచి 120 బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కూటమి నాయకులు, అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. పట్టణంలోని వార్డులలో పారిశుధ్య నిర్వహణ బాధ్యత సచివాలయం శానిటరీ సెక్రటరీలదేనన్నారు. ప్రతిరోజు వార్డులలో పర్యటించి, ఫాగింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.మధులత, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు పాల్గొన్నారు.

విజిలెన్స్ ప్రేక్షకపాత్ర

(మొదటి పేజీ తరువాయి)

(ఎమ్‌డియు) వాహనదారులను గుప్పిట్లో పెట్టుకున్న మాఫియా ఏ వాహనం ఎక్కడికి పోవాలో నిర్దేశిస్తున్నారు. ఎమ్‌డియు వాహనాల్లో వెళ్తున్న బియ్యం ప్రజల కోసం తీసుకువెళుతున్నారనే భావనతో పోలీసులు, ఇతర శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. కానీ ఈ వాహనాల నుంచి ఇతర వాహనాల్లోకి బియ్యం ఎక్కించి అక్కడ నుంచి రహస్య స్థావరాల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో నెలకు ఐదు వేల టన్నులు బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలిపోతున్నాయని తెలిసింది. పౌరసరఫరాల శాఖ అధికారులు వినియోగదారులే తప్పని వారే వాహనదారులకు ఇచ్చి డబ్బు తీసుకుంటున్నారని నెపం మోపుతున్నారు. కానీ పౌరసరఫరాల శాఖ అధికారులు ఆకస్మికంగా ఒక్క వాహనాన్ని తనిఖీ చేసి అక్రమాలను నియంత్రించిన దాఖలాలు లేవు. రేషన్ అక్రమాలను నియంత్రించాల్సిన వివిధ శాఖల అధికారులు వాహనదారుల వద్ద, అక్రమ వ్యాపారం చేసే వారి వద్ద నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుని మిన్నకుండిపోతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ఇదొక సర్వసాధారణ అంశంగా భావిస్తున్నారు. అప్పట్లో వైసిపి ప్రజా ప్రతినిధులకు ముడుపులు ఇస్తే ఇప్పుడు టిడిపి ప్రజా ప్రతినిధులు లేదా వారి అనుచరులకు ముడుపులు ఇస్తున్నామని రేషన్ అక్రమార్కులు ధీమాగా ఉన్నారు.

టిడిపి నాయకునిపై అదే పార్టీవారి దాడి

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరం చెప్పడంతో వివాదమైంది. దీనిపై ఇరు పక్షాలు పోలీసులకూ ఫిర్యాదు చేసుకున్నారు. ఈ క్రమంలో ఉప్పుతోళ్ల శ్రీనివాసరావు బంధువులకు చెందిన ఫంక్షన్ ఉండడంతో దానికి వెళ్లే నిమిత్తం శ్రీనివాసరావు తన తల్లిని ద్విచక్ర వాహనంపై స్థానిక బస్టాండ్ వద్ద తన ద్విచక్ర వాహనంపై దిగబెట్టాడు. అయితే ఆమె ఏదో వస్తువు మర్చిపోయానని చెప్పడంతో దాన్ని తీసుకుని మళ్లీ బస్టాండ్‌కు శ్రీనివాసరావు తన బైక్‌పై వెళ్తుండగా గత ఫ్లెక్సీల వివాదంలో ఉన్న ఉప్పుతోళ్ల చిన్న ఏడుకొండలు, ఉప్పుతోళ్ల వెంకటేశ్వర్లు, ఉప్పుతోళ్ల గురవయ్య ,ఉప్పుతోళ్ల మసయ్య, ఉప్పుతోళ్ల శ్రీకాంత్, ఉప్పుతోళ్ల పెద్ద అంజి, చల్లా హనుమయ్య తదితరులు శ్రీనివాసరావుపై మారణాయుధాలతో దాడి చేసి పరారయ్యారు. దాడిలో శ్రీనివాసరావు కాళ్ల వెముకలు విరగడంతో బంధువుల ప్రైవేటు వాహనంలో మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దాడిపై క్షతగాత్రుని తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశామని ఎస్ఐ సమందర్‌వలి తెలిపారు. గ్రామంలో తదనంతరం ఘర్షణలు తలెత్తకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామాన్ని ఎస్ఐతోపాటు మాచర్ల రూరల్ సిఐ నఫీజ్ బాష సందర్శించారు.

మానవ మేధస్సును సమాజ శ్రేయస్సుకే వినియోగించాలి

ప్రజాశక్తి - ఏఎన్‌యు

మానవ మేధస్సును సమాజ శ్రేయస్సుకే వినియోగించాలని ఆంధ్ర ప్రదేశ్ పూర్వ దూరదర్శన్ వార్తా విభాగాధిపతి ఐఐఎస్ డాక్టర్ జి.కొండలరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయంలో కామర్స్ బిజినెస్ మేనేజ్మెంట్ ,జర్నలిజం మాస్ కమ్యూనికేషన్ విభాగాల ఆధ్వ ర్యంలోయునెస్కో క్లబ్ గుంటూరు వారి సమన్వ యంతో జరిగిన సదస్సులో ఆయన విశిష్ట అతిథిగా కీలకోపన్యాసకులుగా పాల్గొన్నారు. 'సాంకేతిక యుగంలో విద్యార్థులబాధ్యత' అనే అంశంపై అవగా హన సదస్సు నిర్వహించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ తాత్కా లిక ఉపకులపతి ఆచార్య కంచర్ల గంగాధర రావు, వర్సిటీ రెక్టార్ ఆచార్య కే రత్నషీలామణి కామర్స్ బిజినెస్ మేనేజ్మెంట్ పీఠా ధిపతి ఆచార్య రామినేని శివరామప్రసాద్ మాట్లా డారు. సదస్సులో పాల్గొన్న విద్యార్థులకు ధ్రువపత్రాలను అందించారు.

ఇరువురు నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - తెనాలి

రైళ్లలో ప్రయాణికులను బెదిరించి దొంగతనా లకు పాల్పడుతున్న ఇరువురు నిందితులను రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరు లైన్ ఇన్స్పెక్టర్ కరుణాకరరావు శుక్రవారం వెల్లడించిన వివరాల ప్రకారం ఈనెల 21నరాత్రి కాకినాడ తిరుపతి రైలులో ప్రయాణిస్తున్న మాచర్ల సంతోష్ కుమార్ పై నిడుబ్రోలు రైల్వే స్టేషన్ సమీపంలో నిడు బ్రోలుకు చెందిన నిందితులు దేవర సాయి, ఎర్ర శెట్టి వంశీ కర్రతో దాడి చేసి సెల్ఫోన్ లాక్కుని పరా రయ్యారు. బాధితుడు రైల్వే పోలీసులను ఆశ్ర యిం చడంతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితు లను శుక్రవారం అరెస్టు చేసి, వారి నుంచి రెండు సెల్ఫోన్లు, నేరానికి ఉపయోగించిన స్కూటీ రును స్వాధీనం చేసుకొని, విజయవాడ రైల్వే కోర్టుకు తరలించారు. కోర్టు రిమాండ్ విధించడంతో రాజ మండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీ ఆర్పి ఎస్ఐ వెంకటాద్రి, సిబ్బంది పాల్గొన్నారు.

వాల్ స్టిక్కర్లు ఆవిష్కరించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఫిరంగిపురం

సిపిఎం పార్టీ ఫిరంగిపురం మండల కమిటీ ఆధ్వర్యంలో పొనుగుపాడు గ్రామంలో మా ఇంటికి స్మార్ట్ మీటర్ల వద్దు, కరెంట్ చార్జీలు తగ్గించాలని కోరుతూ వాల్ స్టిక్కర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి షేక్ మస్తాన్వలి మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల్లో భాగంగా ఆదానికి లాభాలు చేకూర్చడం కోసం రాష్ట్ర ప్రజల మీద స్మార్ట్ మీటర్ భారాన్ని రుద్దుతున్నారని ఈ స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు ముందుగానే రీచార్జి చేయించుకోవలసి ఉంటుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు జి వెంకటేశ్వర్లురావు, కే కోటేశ్వరరావు, వై నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

పాపారావుకు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

చెన్నం పాపారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిపిఎం నాయకులు, కాజా గ్రామం మాజీ సర్పంచ్ చెన్నం పాపారావు 4వ వర్ధంతి సంద ర్భంగా సిపిఎం కాజాగ్రామ పార్టీ కార్యాలయంలో జరిగిన సభలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఈమని అప్పారావు మాట్లాడుతూ కాజ గ్రామాభివృద్ధిలో సిపిఎం సర్పంచ్ల పాత్ర ఎంతో ఉందని, సిపిఎం సర్పంచిగా పాపారావు చేసిన కృషిని ఈ సంద ర్భంగా వివరించారు. నేతల స్ఫూర్తితో కార్యకర్తలు ప్రజా సమస్యలపై పని చేయాలన్నారు. సభకు మాజీ ఎంపిటిసి ఈదా ప్రతాపరెడ్డి అధ్యక్షత వహిం చారు. రైతు సంఘం నాయకులు ప్రకాష్ రావు, సింహాద్రిస్తున్న మూడోశాఖ కార్యదర్శి నర సింహా రావు, పాపారావు భార్య కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

కెఎల్‌యులో ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీ లోని కెఎల్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో ఔషధ ఆవిష్కరణ, డెలివరీ, ప్రస్తుత ట్రెండ్స్ పై అనుసంధన్ నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్, డిపార్ట్ మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ సంయు క్తంగా అంతర్జాతీయ సదస్సును శుక్రవారం నాడు ఘనంగా ప్రారంభించారు. ఈ సదస్సుకు వర్సిటీ ప్రో చాన్సులర్ డాక్టర్ కెఎస్. జగన్నాథరావు, రిజిస్ట్రార్ డాక్టర్. కె. సుబ్బారావు, లైఫ్ సైన్స్, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ ఎన్ బుచ్చి నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయి సదస్సును ప్రారంభించారు. కెఎల్ ఫార్మ సీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి సదస్సుకు అధ్యక్షత వహించి అధ్యక్షోపన్యాసం చేశారు. వివిధ రాష్ట్రాల నుండి 300 మంది విద్యార్థులు, పిహెచ్‌డి స్కాలర్లు, అధ్యాపకులు ఈ అంతర్జాతీయ సదస్సు కు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. లక్నో నుండి ప్రముఖ సిడిఆర్ఐ శాస్త్రవేత్త డాక్టర్ నరేందర్, ఐఐటి ఇండోర్ నుండి డాక్టర్ హేమ్ చంద్ర ఝా సదస్సులో పాల్గొని ఔషధ ఆవిష్కరణ, అభివృద్ధి మరియు డెలివరీ టెక్నాలజీల ప్రాముఖ్యత, వివిధ వ్యూహాల గురించి విద్యార్థులకు వివ రించారు. కెఎల్ ఫార్మసీ కళాశాల ఆచార్యులు డాక్టర్ మణికంఠ సదస్సుకు కన్వీనర్‌గా వ్యవహరించారు. కార్యక్రమం లో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధివర్మ, ప్రో చాన్సులర్ డాక్టర్ కెఎస్.జగన్నాథరావు, ప్రొవీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంక ట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ ఎస్.ప్రసాద్, లైఫ్ సైన్స్, ఆర్ అండ్ డి డైరెక్టర్ డాక్టర్ ఎన్ బుచ్చి నాయుడు, కెఎల్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.చక్రవర్తి, కన్వీనర్ డాక్టర్ మణికంఠ పాల్గొన్నారు.

"అప్లికేషన్స్ ఇన్ డేటా సైన్స్ కాన్సెప్ట్స్" పై జాతీయ సెమినార్ ప్రారంభం

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ విభాగం మరియు ఎ ఐ ఎల్ ఎల్ సంయుక్తంగా "డేటా సైన్స్ కాన్సెప్ట్స్ యొక్క అన్వయాలు" అనే రెండు రోజుల జాతీయ సెమినార్ ను ప్రారంభించారు. ఈ సెమినార్ ప్రారంభోత్సవం ఆచార్య నాగా ర్జున విశ్వవిద్యాలయం ఇన్-చార్జ్ వైస్ ఛాన్సలర్ కంచర్ల గంగాధరరావు నిర్వహించారు. డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటె లిజెన్స్, మెషీన్ లెర్నింగ్ రంగాలలో ఉద్భవిస్తున్న కొత్త అవకా శాలపై విసి ప్రసంగించారు. రిజిస్ట్రార్ సింహాచలం మాట్లా డుతూ డేటా సైన్స్‌రంగం కేవలం కంప్యూటర్ సైన్స్‌లో మాత్రమే కాకుండా, జీవశాస్త్రం రసాయన శాస్త్రం వంటి అనేక ఇతర రంగాలలో కూడా విస్తతంగా ఉపయోగపడుతుందని చెప్పారు. సుప్రజ టెక్నాలజీస్ సిఈఓ సంతోష్ చలపుడి సైబర్‌దాడులు, సైబర్ సెక్యూరిటీ పై అవగాహన కల్పించారు. డా. ఎన్ వి. గణపతిరాజు వారి బృందం డేటా సైన్స్ అప్లికేషన్స్, వివిధ టూల్స్‌పై హాండ్స్-ఆన్ సెషన్ నిర్వహించారు. కార్య క్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ రత్నషీల మణి, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి. సిద్దయ్య, అసిస్టెంట్ ప్రిన్సిపాల్స్ డా. చంద్రమౌళి, డా. గోపీకృష్ణ, వర్క్‌షాప్ కన్వీనర్ డా.వి. బాలాజీ, ట్రెజరర్ పి. యుగంధర్ రెడ్డి, కో-ఆర్డినేటర్ డాక్టర్ యు.సతీష్ కుమార్, కో-ఆర్డినేటర్ డా.కె.చైతన్య, విభాగ అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

చెత్తకుప్పలు కనిపిస్తే చర్యలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలో ఎక్కడా చెత్తకుప్పలు కనిపించటా నికి వీలు లేదని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. సోమవారం నాటికి గుర్తించిన గార్బేజ్ వల్నరబుల్ పాయిం ట్స్‌లో ప్రజలు చెత్త వేయకుండా గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయా లని ఆదేశించారు. శుక్రవారం పారిశుధ్యంపై అధికారు లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లా డుతూ గుంటూరు నగరంలో 338 గార్బేజ్ పాయింట్లు ఉన్నా యని, ఇక నుండి గార్బేజ్ పాయింట్స్‌లో ప్రజలు చెత్త వేయుటానికి వీలు లేదన్నారు. అక్కడ గ్రీన్ మ్యాట్‌లను ఏర్పాటు చేసి, బోర్డులను కూడా ఏర్పాటు చేయించాలన్నారు. అయినప్పటికీ ఎవరైనా చెత్త వేస్తుంటే సదరు ప్రాంతాలలో వర్కర్ల చేత నిఘా ఏర్పాటు చేసి, చెత్త వేసే వారికి అపరాధ రుసుం విధించాలని శానిటరీ ఇన్స్పెక్టర్లను ఆదేశిం చారు. బుధవారం నుండి సదరు ప్రాంతాలలో చెత్త ఉంటే సంబధిత శానిటరీ ఇన్స్పెక్టర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే నగరంలో అనధికార చికెన్, మటన్, ఫిష్ మార్కెట్లు ఏర్పాటు చేస్తున్నారని, అటువంటి వాటిపై చర్యలు తీసుకోవా లన్నారు. సదరు సమావేశంలో యస్.ఈ నాగమల్లేశ్వర రావు సి.యం.హెచ్.ఓ డాక్టర్ అమతం, యమ.హెచ్.ఓ డాక్టర్ రవిబాబు, ఈ.ఈ సుందరరామిరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ వెంకటేశ్వర్లరావు తదితరులు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో ప్రగతి టాప్

ప్రజాశక్తి- తాడేపల్లి

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తాడేపల్లి పట్ట ణంలోని సుందరయ్య నగర్ ప్రగతి బాల విద్యాలయం అగ్రభాగాన నిలి చిందని కరస్పాండెంట్ ఎస్ గిరిజ, ప్రధానోపాధ్యాయులు వెంకటరత్నం (నాని) తెలిపారు. తమ పాఠశాలలో డి సుజన 600 మార్కులకు గాను 590 మార్కులు సాధించి టాపర్గా నిలిచారని వివరించారు. ఏ లీలా సరస్వతి 578, ఎస్.కె రుక్సానా 568, ఎస్ ప్రదీప్ 568, టి వర్షిత 558, బి అంజలి 555, ఎం మహేశ్వరి 548 మార్కులతో తర్వాత స్థానాల్లో నిలువగా మరో ఏడుగురు విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని చెప్పారు. సుందరయ్యనగర్‌లో ప్రప్రథమంగా స్థాపించబడి నాటి నుండి నేటి వరకు తన ప్రత్యేకతను చాటుకుంటున్న ప్రగతి బాల విద్యాలయంకు పునాదిరాళ్లు విద్యార్థుల తల్లి దండ్రు లేనని తెలిపారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన ఉపా ధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులకు అభినందనలు చెప్పారు.

డి. సృజన, ఎ.లీలా సరస్వతి, ఎస్.కె.రుక్సానా, ప్రదీప్

ఉత్తమ ఫలితాలు సింధు నికేతన్ సొంతం

ప్రజాశక్తి- తాడేపల్లి

పది ఫలితాల్లో తాడేపల్లి పట్టణంలోని మహానాడు సింధునికేతన్ (ఆదర్శపాఠశాల) అత్యుత్తమ ఫలితాలు తమ సొంతం చేసుకోవడం తనకు గర్వకారణంగా ఉందని పాఠ శాల ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాస్ రెడ్డి చెప్పారు. 575 మార్కులతో వై.మనోహర్ రెడ్డి పాఠశాల టాపరుగా నిలవగా ఎం జస్వంత్ రెడ్డి 568, బి జితేంద్ర 565 మార్కులతో తర్వాత స్థానాలలో నిలిచారని తెలిపారు. మరో 14 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారని వివరిం చారు. అత్యుత్తమ క్రమశిక్షణ, అనుభవజ్ఞులు, సుశిక్షితులైన ఉపాధ్యాయులతోనే ఇది సాధ్యమైందని వెల్లడించారు. స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఉచిత స్టడీ సర్కిల్స్, చక్కని చేతిరాత తమ పాఠశాల ప్రత్యేకత అని చెప్పారు. ఇంతటి ఘన విజయానికి కారణమైన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

మనోహర్‌రెడ్డి జస్వంత్‌రెడ్డి జితేంద్ర

ప్రమాదవశాత్తు మరణించిన 15 పాడి గేదెలు

రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం, బేతపూడి గ్రామానికి చెందిన కలవ కొల్లు ప్రసాద్‌రావుకు చెందిన 15 పాడి గేదెలు ప్రమాద వశాత్తు ఐదు రోజుల కిందట మృతి చెందాయి. రూ. 18 లక్షల విలువైన పాడి గేదెలు మృతి చెందటంతో తమ కుటుంబం జీవనాధారం కోల్పోయామని, తమను ఆదుకోవాలని ప్రసాద్ రావు మంత్రి నారా లోకేష్‌ను స్థానిక నాయకుల ద్వారా కోరారు. స్పందించిన మంత్రి నారా లోకేష్ శుక్రవారం స్థానిక నాయకుల ద్వారా రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందజేయించారు. ఆర్థిక సహాయం అందజేయడం పట్ల రైతు కుటుంబ సభ్యులు మంత్రికి కృత జ్ఞతలు తెలిపారు. కలవకొల్లు ప్రసాద్‌రావు మిత్రులు అందరూ కలిసి మరో రూ.3లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లా డుతూ పాడి గేదెలు మృతి చెందటంతో ప్రసాద్‌రావు కుటుంబం ఎంతో నష్టపోయిందని, రోజు పాలిచ్చే గేదెలు మృతి చెందడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో టిటిడీ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, మంగళగిరి మార్కెట్ యార్డ్ చైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, మార్కెట్ యార్డ్ వైస్‌చైర్మన్ ఎర్రగుంట్ల భాగ్యా రావు, మండల ప్రధాన కార్యదర్శి ఎం. వెంకట్రావు, నియోజక వర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆరుద్రభూలక్ష్మి పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఇరువురు బాలురికి స్థానం

ప్రజాశక్తి - తెనాలి

నిశ్శంకరరావు అభిషేక్ కందుల రాజశేఖర్

అత్యంత ప్రతిష్టాత్మక మైన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో పట్టణా నికి చెందిన బాలుడు నిశ్శంకరరావు అభిషేక్, రూరల్ గ్రామం కోపల్లెకు చెందిన కందుల రాజ శేఖర్‌కు స్థానం లభిం చింది. 2024 డిసెంబర్ ఒకటిన హెలెల్ మ్యూజిక్ స్కూల్ ద్వారా ఆగస్టీన్ దండంగి ఆధ్వర్యంలో 18 దేశాల విద్యార్థులు మ్యూజిక్ ప్రదర్శనలో ఆన్లైన్ వేదికగా పాల్గొన్నారు. ఈ ప్రద ర్శనలో పాల్గొన్న అభిషేక్, రాజశేఖర్ కీ బోర్డు ప్లే చేసి అత్యంత ప్రతిభను కనబరచడంతో గిన్నిస్ బుక్‌లో స్థానం లభించిందని, శుక్రవారం విజయవాడ మెట్రోపాలిటన్ చర్చిలో నిర్వహించిన కార్యక్రమం లో ప్రతినిధులు పంపిన మెడల్స్, సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను అందుకున్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు.

మలేరియా నివారణకు సహకరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయ ప్రాంగణంలో నిర్వ హించిన కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయలక్ష్మి సిబ్బందితో మలేరియా నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సంద ర్భంగా ఏర్పాటు చేసిన ర్యాలీని ఆమె పచ్చజెండా ఊపి ప్రారం భించారు. డిఎంహెచ్ఓ మాట్లాడుతూ పరస్పర సహ కారంతో, పరిసరాల పరిశుభ్రత, నీటి నిల్వల నివారణ, దోమ తెరలు వాడ డం ద్వారా, ఫ్రైడేను డ్రైడేగా పాటించటం ద్వారా దోమకాటును నివారించుకోవచ్చని అన్నారు. అనంతరం డిఎం హెచ్ఓ కార్యా లయం నుండి నగరంపాలెం మూడు బొమ్మల సెంటర్ మీదుగా తిరిగి డిఎంహెచ్ఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఏ. శ్రావణ్ బాబు, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ లక్ష్మానాయక్, రాజానాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఈపిఎఫ్ రీజనల్ ఆఫీసు వద్ద పెన్షనర్లు ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

అకారణంగా హయ్యర్ పెన్షన్ దరఖాస్తులు తిరస్కరించటం, పెన్షన్ చెల్లింపులు నెలల పర్యంతం ఆలస్యం చేయటం, పెన్షన్ అంశంపై సుప్రీం కోర్టు తీర్పును తొలగించటం, చట్టవిరుద్ధంగా హయ్యర్ పెన్షన్ లెక్కించి, పెన్షన్ తగ్గించటం మొదలైన కార్మిక, పెన్షనర్లకు వ్యతిరేకంగా ప్రావిడెంట్ ఫండ్ ట్రస్ట్ చర్యలకు నిర సనగా శుక్రవారం గుంటూరులోని ప్రావిడెంట్ ఫండ్ రీజనల్ కార్యా లయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏపిఎస్ ఆర్టీసి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, ఆర్టీసి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసి యేషన్ పిలుపు మేరకు ధర్నా నిర్వహించి, అనంతరం పిఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ధర్నాకు బి.దశరధ రామి రెడ్డి అధ్యక్షత వహించగా, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్పరెడ్డి, ఆర్టీసి రిటైర్డ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కానాల గంగాధరరావు, రాష్ట్ర నాయకులు సత్యవతి, ఏపిఆర్‌పిఎ రాష్ట్ర నాయకులు బాబుప్రసాద్, ఎం.హరిప్రసాద్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కార్యదర్శి టివిజి రవిశంకర్, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నిందితుడు పరారీ .. ఆపై ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - తెనాలి

మహిళ ఆత్మహత్య కేసులో నిందితుడు పోలీస్ స్టేషన్ నుంచి పరారయ్యాడు. సేకరించిన వివరాల ప్రకారం గుడివాడ లోని పోట్టి ఫారంలో పనిచేస్తున్న వివాహిత కామంచి ఆమని (42)ని పాలపర్తి మహేష్ వేధించేవాడు. ఈ విషయం పోట్టి యజమానికి, తన భర్తకు విషయం తెలిపింది. వారు మహేష్‌ను వారించటంతో, ఆమెతో అక్రమ సంబంధం ఉన్నట్లు ప్రచారం చేశాడు. మనస్థాపానికి గురైన ఆమని ఈనెల 23న కోళ్ల ఫారం లోనే గడ్డి మందు సేవించి, పొన్నూరు ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ 24న మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ నిమిత్తం నిందితుడు మహేష్‌ను శుక్రవారం స్టేషన్‌కు పిలిపించారు. పోలీసుల కళ్ళు కప్పి బయటకు వెళ్లిన మహేష్ గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేయడంతో సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు అతనిని చికిత్స నిమిత్తం ప్రైవేటు వైద్యశాలలో చేర్పించారు. ఎస్సై ఆనంద్ మాట్లాడుతూ నిందితుడిని అరెస్టు చేయలేదని, విచారణ నిమి త్తం స్టేషనుకు పిలిపించామని తెలిపారు. దీనిపై విచారణ చేపట్టినట్లు తెలిపారు.

నేటి నుండి స్లాట్ విధానంలో రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

రిజిస్ట్రేషన్ శాఖలో స్లాట్ బుకింగ్ విధానం శనివారం నుండి అమలులోకి రానుంది. డైనమిక్ క్యూ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (డిక్యూఎంఎస్) ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. చిలకలూరిపేట రిజిస్ట్రేషన్ కార్యాలయ పరిధిలోని అన్ని గ్రామాల్లోని ఇళ్లు, స్థలాలు, పొలాలు, ఇతర కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్ల కోసం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి లేకుండా నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసుకునే వీలు ఈ విధానంలో ఉంటుందని అధికారులు చెబుతున్నారు. గతంలో కొందరు మంచి రోజు అని, మంచి ముహూర్తమని రిజిస్ట్రేషన్లు చేసుకునేవారు. ఆ సందర్భాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు అర్ధరాత్రి వరకు పనిచేసేవి. ప్రస్తుతం స్లాట్ బుకింగ్ విధానంలో ఇందుకు అవకాశం ఉండదు.

రిజిస్ట్రేషన్ అవసరమైనవారు రిజిస్ట్రేషన్ శాఖ వెబ్‌సైట్‌లోకి వెళ్తే అందుబాటులో ఉన్న స్లాట్లు కనిపిస్తాయి. ఎంచుకున్న స్లాట్ ఆధారంగా సెల్‌ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దానిని రిజిస్ట్రేషను సమయంలో రిజిస్ట్రారుకు చెప్పాల్సి ఉంటుంది. ఈ సేవలు ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ గంటకు 12 చొప్పున స్లాట్‌లు ఉంటాయి. ఒకసారి స్లాట్ బుక్ చేసుకున్న తర్వాత ఆ సమయానికి రిజిస్ట్రారు కార్యాలయానికి వెళితే అరగంటలో రిజిస్ట్రేషను పూర్తవుతుంది. స్లాట్ సమయం నుంచి గంటలోపు వెళ్లలకుంటే ఆ స్లాట్ రద్దవుతుంది. మళ్లీ అందుబాటులో ఉన్న స్లాట్‌ను నమోదు చేసుకోవాలి. నూతన విధానంపై రిజిస్ట్రేషన్ శాఖ అవగాహన కార్యక్రయాలు నిర్వహించినా ఇప్పటికే సందేహాలు లేకపోలేదు.

నూతన విధానం ద్వారా సేవల్లో జాప్యం ఉండదని, సిఫార్సులు, దళారుల జోక్యం లేకుండా కక్షిదారులు మెరుగైన సేవలు పొందవచ్చని ప్రభుత్వం చెబుతోంది. స్లాట్ బుకింగ్ ద్వారా అపాయింట్మెంట్ తేదీ, సమయాన్ని ముందే తెలుసుకోని హడావుడి ఏమీ లేకుండా పని పూర్తిచేసుకోవచ్చు. పబ్లిక్ డేటా ఎంట్రీ (పిడిఇ) పద్ధతి ద్వారా స్లాట్ బుక్ చేసుకోవచ్చు. అధికారిక వెబ్సైట్ డిజిటల్ క్యూ మేనేజ్మెంట్ సిస్టమ్ (డిక్యూఎంఎస్)లో చేసుకోవచ్చు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడానికి ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయలో అందుబాటులో ఉంచామని చిలకలూరిపేట సబ్ రిజిస్ట్రార్ షేక్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. స్లాట్ బుకింగ్‌పై అవగాహనా కోసం తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

జీతం అడిగితేనే పనిలో నుండి తీసేస్తారా?

37వ రోజుకు పారిశుధ్య కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పని చేసినన్ని రోజులకు జీతం అడిగామనే కారణంగా తమను విధుల నుండి తొలగించారని మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చేస్తున్న ఆందోళన శుక్రవారం 37వ రోజుకు చేరింది. నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్ష శిబిరం వద్ద ఆందోళనలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) పల్నాడు జిల్లా గౌరవాధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ కార్మికుల శ్రమను దోచుకోవడం తగదని, పైగా అప్కాస్‌లో నమోదైన వారిని కూడా బదిలీ కార్మికులంటూ 40 మందిని పనులకు రాకుండా నిలిపేయడం దారుణమని అన్నారు. వీరిని సత్వరం విధుల్లోకి తీసుకుని ఇతర కార్మికులతోపాటు జీతాలివ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి న్యాయం చేసే వరకూ ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.

వేడుకల్లో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు

ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలకు యుజిసి అటానమస్ గుర్తింపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం కేశానుపల్లిలోని ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా లభించింది. ఈ మేరకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) కళాశాలకు ఉత్తర్వులు పంపింది. 2008లో ప్రారంభైన కళాశాల అనేక అంశాల్లో అత్యున్నత ప్రమాణాలతో మెరుగైన ఫలితాలు సాధించడం వల్ల అటానమస్ హోదా పొందిందని కాలేజీలో శుక్రవారం సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ షేక్ మీరావలి మాట్లాడుతూ తమ కళాశాల యూజిసి అటానమస్ హోదా సాధించడం గొప్ప విజయంగా భావిస్తున్నామన్నారు. యూజిసి గుర్తింపు సాధించడంలో అధ్యాపకులు, సిబ్బంది సమిష్టి కృషి ఉందన్నారు. తమ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే అత్యాధునిక నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ బోధన సాగిస్తున్న నేపథ్యంలో కళాశాల స్థాపించిన దగ్గర నుండి విద్యార్థులు ప్రతి ఏడాది 86 శాతం ఉద్యోగాలు సాధిస్తున్నారని తెలిపారు. యూనివర్సిటి స్థాయిలో 5 సార్లు బంగారు పతకాలు సాధించామన్నారు. సెక్రటరీ-కరస్పాండెంట్ షేక్.కరీమ్ మొహిద్దిన్, మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ షేక్ నజీమా మాట్లాడుతూ కళాశాల నిర్వహణలో తమ బాధ్యత మరింత పెరిగిందన్నారు. ప్రతి ఏడాది ప్రతిభ చాటిన విద్యార్థులకు రూ.5 లక్షలు మెరిట్ స్కాలర్‌షిప్ కింద అందజేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థినుల ఇళ్లకు పల్నాడు కలెక్టర్

ఉన్నత చదువు బాధ్యత ప్రభుత్వమే చూసుకుంటుందని భరోసా

విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడుతున్న కలెక్టర్, పక్కన డిఇఒ తదితరులు

ప్రజాశక్తి - కారంపూడి

పదో తరగతి పరీక్ష ఫలితాలలో అత్యధిక మార్కులు సాధించిన మండలంలోని ఒప్పిచర్ల జెడ్‌పి పాఠశాల విద్యార్థిని పావనిచంద్రిక (598), కారంపూడిలోని జెడ్‌పి పాఠశాల విద్యార్థిని కోనేటి కావ్యశ్రీ (590)ను పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రత్యేకంగా అభినందించారు. కారంపూడి మండలంలో శుక్రవారం పర్యటించిన కలెక్టర్ విద్యార్థినుల ఇళ్లకు వెళ్లారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినుల ఉన్నత చదువుకు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరిస్తుందని భరోసానిచ్చారు. కలెక్టర్ తొలుత కారంపూడిలోని వినుకొండ రోడ్డులో ఉపాధి హామీ కింద జరుగుతున్న నీటి తొట్లెలను పరిశీలించారు. కార్యక్రమంలో డిఇఒ ఎల్.చంద్రకళ, ఆర్‌డిఒ మురళీ, ఎంఇఒ రవికుమార్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్, ఎంపిడిఒ జి.శ్రీనివాసరెడ్డి, హెచ్ఎం అనంతశివ, పంచాయతీ విస్తరణాధికారి కాసిన్య నాయక్ పాల్గొన్నారు.

అనవసరంగా బయటకు రావొద్దు

ప్రజాశక్తి - మాచర్ల

ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అనవసరంగా ఎండ టైమ్‌లో వచ్చి రిస్క్ తీసుకోవద్దని ప్రభుత్వ వైద్యురాలు డాక్టరు బి.లక్ష్మీప్రసన్న సూచించారు. పనులేమైనా ఉంటే ఎండలేని సమయంలో చూసుకోవాలని, ఎండగా ఉన్నప్పుడు తప్పనిసరిగా బయటకు రావాల్సి ఉంటే గొడుగు వాడకం, తాగునీరు తగినంత తీసుకోవటం అవసరమని సూచించారు. ఎండకు శరీరంలోని నీటి శాతం తగ్గుతూ ఉంటుందని, ఈ కాలంలో లభించే పండ్లు తీసుకుంటే శరీరానికి అవసరమైన విటమిన్లు, పోషకాలు అందుతాయని చెప్పారు. అధిక మసాలాలు, నూనె పదార్థాలకు దూరంగా ఉండటం మంచిదన్నారు. నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయ, కీరదోస, కర్బూజ, బొప్పాయి లాంటి పండ్లుకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. కొబ్బరినీరు, మజ్జిగ కూడా ఎక్కువగా తీసుకుంటే మంచిదన్నారు. నీరు ఎక్కువగా త్రాగుతు డీహైడ్రేషన్‌కు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏదైనా తేడా అనిపిస్తే దగ్గరలోని ప్రభుత్వ వైద్యశాలలో సంప్రదించాలన్నారు.

దాడులు ఆపి వాగ్దానాల అమలుపై దృష్టి పెట్టండి

అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసిపి శ్రేణులపై టిడిపి దాడులు : బొల్లా బ్రహ్మనాయుడు

ప్రజాశక్తి - వినుకొండ

వైసిపి శ్రేణులపై దాడులు ఆపి అభివృద్ధిపై అధికారపార్టీ దృష్టి పెట్టాలని మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అధికారం అడ్డం పెట్టుకొని గ్రామాల్లో అధికార పార్టీ శ్రేణులు దాడులు, హింసలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. గంటవారిపాలెం గ్రామంలో చికెన్ కొట్టును కూల్చడమే కాక ఎస్టీలపై దాడులు చేయడం అమానుషమని అన్నారు. వీటిపై శావల్యాపురం ఎస్ఐ, రూరల్ సిఐకి తాను ఫోన్‌లో చెప్పినా స్పందించలేదని, డీఎస్పీకి సమాచారం ఇవ్వటంతో స్పందించినా అప్పటికే జరగాల్సిన నష్టమంతా జరిగిందని అన్నారు. బొమ్మరాజుపల్లి తండాలో దాడి చేసిన వారిని వదిలేసి వైసిపి కార్యకర్తలను తీసుకువెళ్లి ఈపూరు పోలీసులు క్వార్టర్స్‌లో పెట్టి కొట్టారని ఆరోపించారు. పలుకూరు గ్రామంలో 80 ఏళ్ల వృద్ధినిపైగా దాడి చేశారని, కొచ్చర్ల గ్రామంలో 14 ఏళ్ల బాలుడు పై దాడితోపాటు వైసిపి వారి ఇళ్లపై రాళ్ల దాడి చేశారని అన్నారు. గుర్రపు నాయుడుపాలెం, నూజెండ్ల, పాత చరకంపాలెం, చెడ్డవారిపాలెం, భద్రపాలెం, కొండాయపాలెం, వినుకొండ పట్టణం, గుమ్మనంపాడు, గరికపాడు తదితర గ్రామాల్లో వైసిపి శ్రేణులపై దాడి చేసి పోలీసులతోనూ కొట్టించారని ఆరోపించారు. కేసులు నమోదు చేయకుండా స్టేషన్లో ఉంచకుండా పక్క గదుల్లో, క్వార్టర్స్ లో పెట్టి వైసిపి కార్యకర్తలను కొట్టి హింసిస్తున్నారని చెప్పారు. షాపింగ్ కాంప్లెక్స్, బ్రిడ్జిలు, రూ.160 కోట్లతో తాగునీటి పథకం, గిరి ప్రదర్శన రోడ్డు, స్టేడియం, మైనారిటీ కాలేజీ ఇలా ఎన్నో వాగ్దానాలు చేసిన ఎమ్మెల్యే వాటిని నిలబెట్టుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వంలో రైతుల తీవ్రంగా నష్టపోయారని, మిర్చి, ధాన్యం,అపరాలు, పొగాకు తదితర పంటలకు మద్దతు ధరల్లేవని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ధరలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు ప్రసాద్, అంజిరెడ్డి, శివ, చెన్నయ్య, నాగేశ్వరరావు, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోపణలే పనిగా పెట్టుకున్న బొల్లా : టిడిపి

ప్రజాశక్తి-ఈపూరు

మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రజా సమస్యలపై ప్రశ్నించకుండా జీవీ ఆంజనేయులుపై అసత్య ఆరోపణలు చేయడమే పనిగా పెట్టుకున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు అన్నారు. కొచ్చర్ల, బొమ్మరాజుపల్లి తండాలలో జరిగిన గొడవలపై బ్రహ్మనాయుడు చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ జగ్గారావు ఈపూరులో విలేకర్లతో మట్లాడారు. వైసిపి హయాంలో అధికార అహంకారంతో తప్పుడు కేసులు బనాయించి టిడిపి నాయకులను వేధింపులకు గురి చేసిన ఘనత బొల్లాదన్నారు. కొచ్చర్లలో జనసేన కార్యకర్తల ఇళ్ల వద్దకు వెళ్లి వైసిపి నాయకులు దాడి చేసి గాయపరిచారన్నారు. బొమ్మరాజు పల్లి తండాలో గొడవలకు కారణం వైసిపి వారేనని, టిడిపి వారు గాయపడ్డారని చెప్పారు. అధికార పార్టీపై విమర్శలు మానుకుని ప్రజా సమస్యలపై పోరాడాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు టి.బాలయ్య, నాయకులు కె.కోటేశ్వరరావు, ఎ.కోటేశ్వరరావు, సర్పంచి జి.శ్రీనివాసరావు, ఎన్.కిషోర్, జనసేన నాయకులు వెంకట నరసయ్య పాల్గొన్నారు.

ఎఎన్ఎస్ సిబ్బందికి కిట్లు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఎఎన్ఎస్‌లో పని చేస్తున్న పోలీస్ సిబ్బందికి బ్యాగులు, వాటర్ బాటిల్స్, క్యాప్‌లను నరసరావుపేటలోని పల్నాడు జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.శ్రీనివాసరావు శుక్రవారం అందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు జెవి సంతోష్, సత్తిరాజు, నరసరావుపేట, సత్తెనపల్లి డీఎస్పీలు కె.నాగేశ్వరరావు, ఎం.హనుమంతరావు, ఎఎన్ఎస్ ఆర్ఐ యువరాజు పాల్గొన్నారు.

- గత్యంతరం లేక కార్పోరేట్ కళాశాలలకు పరుగులు పెడుతున్న విద్యార్థులు
- పేద విద్యార్థులకు భారంగా ఇంటర్ విద్య

నియోజకవర్గంలో ప్రభుత్వ కళాశాల ఏది?

కొలకలూరు ఏరియల్ వ్యూ

ప్రజాశక్తి - తెనాలి

ఎంతో చైతన్యవంతమైన తెనాలి నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు అందని ద్రాక్షగానే మిగిలిపోతుంది. గతంలో ఉన్న ఎయిడెడ్ కళాశాలలు గత ప్రభుత్వ పుణ్యమాని దాదాపు కనుమరుగయ్యాయి. చివరకు ఉన్నత పాఠశాల అప్ గ్రేడ్ పేరిట అంగలకుదురులో ఏర్పాటు చేసిన జూనియర్ కళాశాల బాలికలకే పరిమితమైంది. దీంతో ఆర్థిక ఇబ్బందుల నడుమ పేద విద్యార్థులు సతమతమౌతున్నారు. ప్రభుత్వ విదానం కార్పోరేట్లకు ఊతమిస్తున్నట్లుగా ఉందన్న విమర్శలున్నాయి. నియోజకవర్గంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవశ్యకత వివరాలిలా ఉన్నాయి. తెనాలి నియోజకవర్గంలో తెనాలి, కొల్లిపర రెండు మండలాలు ఉన్నాయి. తెనాలి మండల పరిధిలో 18 గ్రామాలు, కొల్లిపర మండలంలో 20 గ్రామాలున్నాయి. విద్య, వ్యాపార, రాజకీయ రంగాల్లో ఈ ప్రాంతం ఎంతో చైతన్యవంతమైంది. అయితే విద్యారంగంలో ఎన్ని సంస్కరణలు వచ్చినా పేద వర్గాల అవసరతలను తీర్చటంలేదు. కార్పోరేట్ కళాశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న తరుణంలో ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రభుత్వాలు ఏర్పాటు చేయలేకపోవటమే ఇందుకు నిదర్శనం. గతంలో పేద విద్యార్థులకు అందుబాటులో ఉన్న ఎయిడెడ్ కళాశాలలు గత ఐదేళ్ళ వైసిపి పాలనలో మూతపడ్డాయి. మండలానికి రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేస్తామన్న గత ప్రభుత్వం ఆ హామీని కూడా నెరవేర్చలేదు. పైగా పాఠశాలలు అప్‌గ్రేడేషన్ నినాదం అందుకుంది. నేరుగా కళాశాలను ఏర్పాటు చేయకుండా అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కళాశాల స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది. పాఠశాల ఉపాధ్యాయులనే కళాశాలకు

కొలకలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఉపయోగించింది. ఆ కళాశాల కూడా బాలికలకే పరిమితమైంది. దీంతో ఇంటర్ విద్య కోసం పేద విద్యార్థులు ప్రైవేటు కళాశాలలను ఆశ్రయించి నిలువుదోపిడికి గురౌతున్నారు. ఈ నేపధ్యంలో కో ఎడ్యుకేషన్ కలిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు ఎంతైనా అవసరం.

నియోజకవర్గాన్ని పరిశీలిస్తే....

తెనాలి నియోజకవర్గంలో కొలకలూరు అతి పెద్ద గ్రామం. దాదాపు 20వేల జనాభా, నాలుగు ఎంపిటిసి స్థానాలు, దాదాపు 20 వేల జనాభా, 16వేల ఓటర్లు కలిగిన గ్రామం. గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఖాజీపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జూబిలీ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, వివర్ధిని హైస్కూల్ ఉన్నాయి. ఈ నాలుగు పాఠశాలల నుంచి ప్రతిఏటా కనీసం 300 మంది పదోతరగతి విద్యార్థులు ఇంటర్ విద్యకు బయటకు వెళ తున్నారు. పైగా హాఫ్‌పేట, పెనుమూలి, అనుమర్లపూడి, గుడివాడ గ్రామాల నుంచి కూడా విద్యార్థులు కొలకలూరు పాఠశాలలకు వస్తుంటారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన పాఠశాలల అప్‌గ్రేడేషన్ ప్రతిపాదనలో కొలకలూరు జడ్పీహెచ్‌ఎస్ ఉంది. అయితే అప్పటి ఎమ్మెల్యే కుల సమీకరణలు, తన సామాజిక వర్గానికి మేలు చేసే ఉద్దేశంతో అంగలకుదురుకు ప్రాధాన్యమిచ్చినట్లు అరోపణలున్నాయి. ప్రభత్వం, ప్రజాప్రతినిధులు స్పందించి ఇప్పటికైనా కొలకలూరులో జూనియర్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, కుదరని పక్షంలో కనీసం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలనైనా అప్ గ్రేడ్ చేసి, ఇంటర్ (కో ఎడ్యుకేషన్)కు అవకాశం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అనివార్యం

కొలకలూరులో జూనియర్ కళాశాల ఏర్పాటు అవసరం. ఎందుకంటే గ్రామంలో రెండు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు రెండు ప్రైవేటు హైస్కూల్స్ ఉన్నాయి. కొలకలూరుతో పాటు ఖాజీపేట, హాఫ్‌పేట, పెనుమూలి, గుడివాడ, అనుమర్లపూడి గ్రామాల విద్యార్థులకు కొలకలూరే కేంద్ర బిందువు. పైగా గ్రామంలో అక్షరాస్యత శాతం ఎక్కువ. గతంలో విద్యాదాత పొన్నెకంటి బెంజిమెన్ ఏర్పాటు చేసిన బాబు జగజ్జీవన్ రామ్ రెసిడెన్షియల్ ఎయిడెడ్ జూనియర్ కళాశాల ప్రభుత్వ పాలసి విదానాలతో మూతపడింది. ఫలితంగా ఎంతో మంది పేదవిద్యార్థులు విదిలేని పరిస్థితుల్లో ఇంటర్ విద్యకు కార్పోరేట్ కళాశాలలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వం స్పందించాలి. గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి.

- డాక్టర్ పి.జోసఫ్ రత్నాకర్, ఎఎన్‌యూ ప్రొఫెసర్, కొలకలూరు

విద్యార్థులతో అక్షక విద్యా సంస్థల ఛైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి

టెన్త్ ఫలితాల్లో అక్షయ విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి - ప్రతిపాడు

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థుల విజయభేరి మోగించారని అక్షయ విద్యాసంస్థల చైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి తెలియజేశారు. మొత్తం 21 మంది పరీక్షకు హాజరుకాగా 20 మంది విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించారని, వీరిలో 579 మార్కులు సాధించిన షేక్ ఆఫిఫా తబసోమ అత్యధిక మార్కులు సాధించారని, కొల్లూరి వినయ్ 570 మార్కులు, మెరికినపల్లి స్నేహలత 558 మార్కులతో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని వివరించారు. పదిమంది విద్యార్థులకు 500పై మార్కులు వచ్చాయన్నారు. విద్యార్థులకు, విద్యార్థులు తల్లిదండ్రులకి, ఉపాధ్యాయ సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.

బోరుపాలెం బుడ్డోడికి గిన్నిస్ రికార్డ్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం బోరుపాలెం గ్రామానికి చెందిన 12 ఏళ్ల తోకల సంవేద్ బాబు గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డులో స్థానం పొందాడు. విజయవాడ లోని హల్లేల్ మ్యూజిక్ స్కూల్‌లో కీబోర్డ్ ప్లే చెయ్యడంలో శిక్షణ పొంది తదనంతరం 2024 సంవత్సరం డిసెంబర్ 1వ తేదీన గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు వారు నిర్వహించిన కీబోర్డ్ ప్లైయింగ్ ప్రోగ్రాంలో పాల్గన్నాడు. 50 సెకన్ల వ్యవధిలో సరళి స్వరాలను స్పష్టంగా అత్యంత వేగంగా పలికించినందుకు సంవేద్ బాబుకి గిన్నిస్ బుక్ అఫ్ వరల్డ్ రికార్డు యాజమాన్యం అవార్డు ప్రకటించి మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. గత ఏడాది మే 31న ఇన్ జీనియస్ చాంప్స వరల్డ్ రికార్డ్‌లో కూడా సంవేద్ బాబు స్థానం సంపాదించడం విశేషం. చిన్నవయస్సులో రెండు వరల్డ్ రికార్డ్స్ సాధించి నందుకు సంవేద్ బాబు తల్లితండ్రులు, కుటుంబసభ్యులు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య

వాడవాడలా మేడే నిర్వహించాలి...

ప్రజాశక్తి - మంగళగిరి

కార్మికుల దినోత్సవం మేడే మే ఒకటో తేదీన మంగళగిరిలో వాడవాడల మేడే నిర్వహించాలని సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో సిఐటియు విస్తృత సమావేశం సిఐటియు నాయకులు వై.కమలాకర్ అధ్యక్షతన జరిగింది. చెంగయ్య తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అధికారం వచ్చినప్పుడు నుండి కార్మిక హక్కులను కాలరాసే విధానాలను, చట్టాలను తీసుకువచ్చారని విమర్శించారు. రానున్న కాలంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను కార్మికులు సంఘటితంగా ఉండి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిఐటియు నాయకులు వి వి జవహర్లాల్ మాట్లాడుతూ కార్మికులు వివిధ రకాల శ్రమదోపిడికి గురవుతున్నారని అన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంలో కార్మిక వర్గం తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ సమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు జె వి రాఘవులు మాట్లాడుతూ మంగళగిరిలో అన్ని కార్మిక ప్రాంతాలలో మేడే కార్యక్రమాన్ని నిర్వహించాలని అన్నారు. సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం. బాలాజీ, సిఐటియు రూరల్ కార్యదర్శి పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు కృషి చేయాలి

- సేవా కార్యక్రమాలలో ముందు ఉండాలి
- సీపీఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

నివాస ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి ఆ సమస్యలు పరిష్కారం అయ్యేవరకు సిపిఎం శ్రేణులు కృషి చేయాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై.నేతాజీ అన్నారు. నిడమర్రులో సీపీఎం విస్తృత స్థాయి సమావేశంలో శుక్రవారం జరిగింది. కట్టెపోగు వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నేతాజీ మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. సమస్యలను పరిష్కరించే విషయంలో పాలకులు చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని అన్నారు. ప్రజలకు నేడు కమ్యూనిస్టుల అవసరం ఎంతైనా ఉందన్నారు. సీపీఎం శ్రేణులు ప్రజలను అంటిపెట్టుకొని ఉండాలని, వారికి అండదండగా నిలవాలని కోరారు. అమరజీవి పుచ్చలపల్లి సుందరయ్య లాంటి నేతలు ఎన్నో త్యాగాలు చేశారని అన్నారు. పీడిత, తాడిత ప్రజలకు అండదండగా నిలిచారని అన్నారు. అనేక సేవా కార్యక్రమాలను ముందుండి నడిపారని అన్నారు. వారి స్ఫూర్తితో సిపిఎం శ్రేణులు ముందుకు నడవాలని కోరారు. సిపిఎం శ్రేణులు మరణానంతరం వారి నేత్రాలను దానం చేసేందుకు సిద్ధపడాలని కోరారు. సమావేశంలో సీపీఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి డివిజన్ నాయకులు ఎం.భాగ్యరాజు, గైరబోయిన నాగేశ్వరరావు, ఎం రాజముని, ఎం.ప్రసన్న కుమార్, పార్వతి, కట్టెపోగు నాగేశ్వరరావు, గణేష్, కోటేశ్వరరావు, కుంపటి వీరయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు దీటుగా ప్రభుత్వపాఠశాలల ఫలితాలు

ప్రజాశక్తి - పెదకాకాని

పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పోరేట్ పాఠశాలలతో పోల్చుకుంటే ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచారని మండల విద్యాశాఖ అధికారి వి.శంకరరాజు తెలిపారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో షేక్ రిజ్వాన అనే విద్యార్థి 591 మార్కులు సాధించటం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. మండలంలో ప్రభుత్వ పాఠశాలలో మొత్తం 21 మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు సాధించరన్నారు. మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుండి 844 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష వ్రాయగా 694 మంది ఉత్తీర్ణులైన రాని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన అందరూ విద్యార్థులను వారి ఉపాధ్యాయులను తల్లిదండ్రులను ఎంఈఓ వి.శంకరరాజు అభినందించారు.

ప్రతిభ కనబరచిన రిజ్వానకు ఎమ్మెల్యే అభినందన

పదవ తరగతిలో 591 మార్కులు సాధించిన షేక్ రిజ్వానను ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అభినందించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగ ప్రభుత్వ పాఠశాలలో విద్యా బోదన జరుగుతుందని చెప్పటానికి విద్యార్థులు సాధించిన మార్కులే నిదర్శన మన్నారు. మండలంలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులను ఆయన అభినందించారు.

రెండో రోజు 'బాలల వేసవి వినోదం'

ప్రజాశక్తి - చేబ్రోలు

జెవివి (జన విజ్ఞాన వేదిక) ఆధ్వర్యంలో బాలల వేసవి వినోదం కార్యక్రమం పొన్నూరులో రెండో రోజు కొనసాగుతుంది. వేసవి సెలవుల్లో సరదాగా, భారం కాకుండా చదువు బాధ్యతగా ఎలా చదవాలి, పిల్లలకి హ్యాండ్ రైటింగ్, సైన్స్ ప్రయోగాలు, పేపర్ తో బమ్మలు తయారుచేయడం, పాటలు నేర్చుకోవడం వంటి వినోదాత్మక కార్యక్రమాలలో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తున్నట్లు జెవివి జిల్లా నాయకులు శివ నాగేశ్వరరావు, మండల కార్యదర్శి పీవీ శ్రీనివాస్ గారు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 28 వరకు జరుగుతుందని ఆసక్తి ఉన్నవారు తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని తెలియజేశారు. ఈరోజు నిడుబ్రోలు హైస్కూల్ హెడ్ మిస్సెస్ జె. శివలక్ష్మి పిల్లలు పేపర్, బుక్స్ ఎలా అధ్యయనం చేయాలి, ఎలా అర్థం చేసుకోవాలి, విషయాలు ఎలా ప్రజెంటేషన్ చేయాలి అనే అంశంపై బోధించారు.

విద్యార్థినికి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రశంసలు

యశస్విని అభినందిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

ప్రజాశక్తి - అచ్చంపేట

ఈ ఏడాది 10వ తరగతి పరీక్ష ఫలితాలలో 594 మార్కులు సాధించిన విద్యార్థిని యశస్విని స్థానిక ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శుక్రవారం ప్రశంసించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని విద్యార్థులకు ఎన్నో విధాలుగా అవకాశాలు కల్పి స్తుందన్నారు. యశస్విని బాగా ఉన్నత చదువులు చదువుకొని ఉన్నత చదవాలి ఎదగాలంటూ ఆయన ఆకాంక్షించారు విద్యార్థిని తల్లిదండ్రులకు బ్లూ బెల్స్ హైస్కూల్ డైరెక్టర్ భవనం నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ ఎరువ మేరీ శ్రీలత భాష్యం ప్రవీణ్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రపంచ మలేరియా దినోత్సవ ర్యాలీలు

ర్యాలీ నిర్వహిస్తున్న పిహెచ్‌సి వైద్యాధికారి, సిబ్బంది

ప్రజాశక్తి - క్రోసూరు

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పల్నాడు జిల్లా కోసూరు మండలం క్రోసూర్ పీహెచ్సీలో ప్రదర్శన నిర్వహించారు ఈ సందర్భంగా వైద్యాధికారి మహమ్మద్ షాద్ మాట్లాడుతూ "మలేరియా నిర్మూలన దిశగా రీ ఇన్వెస్ట్, రీ ఇమేజింగ్, రీ ఇగ్నైట్"అనబడే అంశాన్ని తీసుకొని అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శాంసన్ దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవ లసిన చర్యలు గూర్చి వివరించారు. మురికి కాలవల్ల చెత్తా చెదా రం వేయరాదని, ఇంటి పరిసరాల్లో నీరు నిలవ లేకుండా చూడాలని, మురికి నీరు నిల్వ ఉన్నచో వారానికి ఒకసారి కిరో సిన్ ఆయిల్ లేక వాడిన ఇంజన్ ఆయిల్ చల్లాలన్నారు. ఇంటి పరిసరాలులో పనికిరాని పడవేసిన డబ్బాలు టైర్లు కొబ్బరి చిప్పలు వాటిలో వర్షపు నీరు చేరి దోమల ఉత్పత్తి జరుగు తుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ శివుడు, మేల్‌స్టాఫ్ నర్స్, ఫార్మసిస్ట్ ఫాతిమా, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మాచర్లలో... ర్యాలీ చేపట్టిన వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

మలేరియా పట్ల ప్రజలు అవగాహనతో ఉంటే మలేరియాను పారద్రోలవచ్చునని స్థానిక సబ్ యూనిట్ అధికారి డిలక్ష్మయ్య అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకోని స్థానిక కోర్టుబజారు, గౌడ కాలనీలోని ప్రభుత్వ వైద్యశాలలో ఆశా కార్యకర్తలకు మలేరియాపై అవగాహన కొరకు పరీక్షలు నిర్వహించారు. లక్ష్మయ్య మాట్లా డుతూ ఇంటి పరిసరాలను, నీటి నిల్వలను పరిశుభ్రంగా ఉంచు కుంటే మలేరియాను పారద్రోలవచ్చు నని వివరించారు. అనంతరం ఆశాలు, మహిళా ఆరోగ్య కార్యకర్తలతో కలసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మలే రియా అంతం 'మలేరియా అంతం మనతోనే' అంటు నినా దాలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వర రావు, అధికారి శ్రీనివాసరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను కాగితాల్లా చూడకుండా, వారి బాధల్ని అర్థం చేసుకోండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రజలిచ్చే అర్జీలు కేవలం కాగితాలు మాత్రమే కాదని, వాటిలో అనేకమంది వేదన, ఎప్పటినుంచో వారు అనుభవిస్తున్న బాధలు, అనేక అపరిష్కృత సమస్యలు ఉంటాయనే వాస్తవాన్ని అధికారులు గ్రహించి పరిష్క రించాలని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు శుక్రవారం సూచించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ఆయన కూటమి నాయకులతో కలిసి గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని చీరాల రోడ్డులో మజీమంత్రి రజనీ మరిది విడుదల గోపికి సంబంధించిన లేఅవుట్‌కి ఎటువంటి అనుమతులు లేవని అది అనధికారంగా గత ప్రభుత్వంలో నిర్మించి ప్రజలను మోసం చేశారని మల్లెల శివనాగేశ్వరరావు కొంత మంది ప్రత్తిపాటి దష్టికి తీసుకొని వచ్చారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి అప్పటికప్పుడే వాటి పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థులు లేరంటూ తమ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారని పింఛన్లు అందించాలని ప్రత్తిపాటి సెర్ప్, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సబ్సిడీ రుణాలకు దర ఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్ని త్వరగా గుర్తించి, రుణాలు అందించాలని ప్రత్తిపాటి బ్యాంకర్లకు సూచించారు. అన్నిపత్రాలున్నా, అర్హతలున్నా తనకు రుణం మంజూరు చేయలేదన్న యువకుడి ఫిర్యాదుపై బ్యాంకర్లతో మాట్లాడారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజా రమేష్, టీడీపీ నాయకులు సదాశివరావు, షేక్ టీడీపీ కరీముల్లా, మధన్‌మోహన్, సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పఠాన్ సమాధ్‌ఖాన్, గంగా శ్రీనివాసరావు, కందుల రమణ, మద్దిబోయిన శివ పాల్గొన్నారు.

అచ్చంపేటలోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన డిపిఓ

ప్రజాశక్తి - అచ్చంపేట

మండల కేంద్రమైన అచ్చంపేట డంపింగ్ యార్డ్‌ను శుక్రవారం జిల్లా పంచాయతీరాజ్ అధికారి భాస్కర్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. డంపింగ్ యార్డ్‌లో నున్న వర్మి కంపోస్టులు, తడి, పొడి చెత్త గ్రేడింగ్ పనిచేయడం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు గతంలో అచ్చంపేటలోని డంపింగ్ యార్డులో చెత్త నుండి సంపద సృష్టికరణలో భాగంగా ఎన్నో అవార్డులు పొందారన్నారు. ప్రభుత్వం గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ వ్యర్థాల ద్వారా వాన పాముల ఎరువు తయారీ, ప్లాస్టిక్ సీసాలు అట్టముక్కల, ఈ వేస్ట్ ద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చు తుందన్నారు స్వచ్ఛ మిత్ర పేరుతో కొంత మంది సిబ్బం దిని ఏర్పాటు చేసి ఇంటింటికి తిరిగి రోజు తడి చెత్త శనివారం ఒక రోజు పొడి చెత్తను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించడం బాధ్యత అన్నారు ఆ తర్వాత వర్మీ కంపోస్టులు ద్వారా వానపాముల ఎరువుల తయారీ కేంద్రంగా కొనసాగించాలన్నారు. జిల్లాలో నాలుగు డంపింగ్ యార్డ్లను డిపిఓ దత్తత తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ వారం రోజుల్లో జిల్లావ్యాప్తంగా డంపింగ్ యార్డ్‌ల ను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తారని ఇప్పటికైనా గ్రామంలో అవగాహన కల్పిస్తూ పారిశుద్ధ్య చర్యలు చేపడుతూ స్వచ్ఛ అచ్చం పేటగా మార్చేందుకు అధికారులు చర్యలు తీసు కోవాలంటే ఆయన సూచించారు. ఎంపీడీవో పి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శి పంతులు నాయక్ గ్రామసర్పంచ్ షేక్ జానీ భాష, వీర బాబు పంచాయతీ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

COURT NOTICE

IN THE HON'BLE COURT OF THE III ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) : VIJAYAWADA

I.A.NO. 299/2021
IN
O.S.NO. 966/2021

Between :
Dronavalli Koteswara Rao
.... Petitioner/ Plaintiff
AND
Valiveti Sujini and others.
.... Respondents / Defendants

To
D2: Valiveti Teja, S/o Late Sambasiva Rao, resident of Flat.No. 504, Srinivasa Apartments, KLU Road, Kunchanapalli, Tadepalli Mandal, Guntur District.
D3: Valiveti Anusha, W/o Late Rakesh, resident of Flat.No. 504, Srinivasa Apartments, KLU Road, Kunchana palli, Tadepalli Mandal, Guntur District.
D4 : Valiveti Sakthika Rakesh, D/o Late Rakesh, resident of Flat.No. 504, Srinivasa Apartments, KLU Road, Kunchanapalli, Tadepalli Mandal, Guntur District.

The above named Plaintiff filed the above suit against you and others for the suit amount of Rs. 2,56,866/- from and out the estate of Deceased Valiveti Sambasiva Rao lying in the hands of you and 1 st Defendant along with suit the plaintiff filed the above I.A.NO. 299/2021 for attachment of the petition schedule property and the said petition was posted to 07.05.2025 for your appearance. You have to attend at 10.30 AM on that day before the above said Hon'ble Court in person or through advocate, failing which the above petition will be decided setting you exparte.

(By Order of the Court)
Ch.Ajay Kumar,
Advocate Jadagamvari Street,
Suryaraopet, Vijayawada-2.

COURT NOTICE

IN THE HON'BLE COURT OF THE III ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION): VIJAYAWADA

O.S.NO. 966/2021

Between :
Dronavalli Koteswara Rao
.... Plaintiff
AND
Valiveti Sujini and others.
.... Defendants

To
D2. Valiveti Teja, S/o Late Sambasiva Rao, resident of Flat.No. 504, Srinivasa Apartments, KLU Road, Kunchanapalli, Tadepalli Mandal, Guntur District.
D3. Valiveti Anusha, W/o Late Rakesh, resident of Flat.No. 504, Srinivasa Apartments, KLU Road, Kunchanapalli, Tadepalli Mandal, Guntur District.
D4. Valiveti Sakthika Rakesh, D/o Late Rakesh, resident of Flat.No. 504, Srinivasa Apartments, KLU Road, Kunchanapalli, Tadepalli Mandal, Guntur District.

The above named Plaintiff filed the above suit against you and others for the suit amount of Rs. 2,56,866/- from and out the estate of Deceased Valiveti Sambasiva Rao lying in the hands of you and 1 st Defendant and the said suit was posted to 07.05.2025 for your appearance. You have to attend at 10.30 AM on that day before the above said Hon'ble Court in person or through advocate,failing which the above petition will be decided setting you exparte.

(By Order of the Court)
Ch.Ajay Kumar,
Advocate.
Jadagamvari Street.
Suryaraopet, Vijayawada-2.

COURT NOTICE

IN THE HON'BLE COURT OF THE III ADDL CIVIL JUDGE (JUNIOR DIVISION) : VIJAYAWADA

I.A.NO. 866/2021
IN
O.S.NO. 966/2021

Between :
Dronavalli Koteswara Rao
.... Petitioner/ Plaintiff
AND
Valiveti Sujini and others
.... Respondents/ Defendants

To
D2 Valiveti Teja, S/o Late Sambasiva Rao, resident of Flat.No. 504, Srinivasa Apartments, KLU Road, Kunchanapalli, Tadepalli Mandal, Guntur District.
D3 Valiveti Anusha, W/o Late Rakesh, resident of Flat.No. 504, Srinivasa Apartments, KLU Road, Kunchanapalli, Tadepalli Mandal, Guntur District.
D4 Valiveti Sakthika Rakesh, D/o Late Rakesh, resident of Flat.No. 504, Srinivasa Apartments, KLU Road, Kunchanapalli, Tadepalli Mandal, Guntur District.

The above named Plaintiff filed the above suit against you and others for the suit amount of Rs. 2,56,866/- from and out the estate of Deceased Valiveti Sambasiva Rao lying in the hands of you and 1 st Defendant along with suit the plaintiff filed the above I.A.NO. 866/2021 for appointment of 3 rd defendant as guardian for 4 th Defendant who is minor and the said petition was posted to 07.05.2025 for your appearance. You have to attend at 10.30 AM on that day before the above said Hon'ble Court in person or through advocate, failing which the above petition will be decided setting you exparte.

(By Order of the Court)
Ch.Ajay Kumar,
Advocate
Jadagamvari Street
Suryaraopet, Vijayawada-2.

NOTICE
IN THE COURT OF THE HON□BLE I ADDL.DIST.JUDGE:: GUNTUR
E.A.No.9/2024 in E.P.No.66/2016
in O.S No:261/2008

Between:
Gunda Pitchaiah. .... Petitioner
And
Rachabatttuni Govinda Rao(Died)
& Others .. Respondents
To.
R-2: Rachabatttuni Pavan Karthik, S/o. late Govinda Rao,
R-3: Rachabatttuni Kanthi Keerthi, D/o. late Govinda Rao,Both are R/o.Flat No. D2, Amaravathi Flats, NARG Apartments, Chenchupeta, Tenali, Guntur Dt.

పై నెంబరు ఇ.ఎ. పిటీషనులో 2&3 రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టు నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:06-05-2025 కి వాయిదా వేసినారు.కావున ఆ రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ లేక మీ వకీలు గారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:06-05-2025

లంకా విజయకుమార్,
లంకా వంశీకృష్ణ,
పిటీషనరు తరపు అడ్వకేట్స్,
రవీంద్ర నగర్, గుంటూరు.

నోటీసు
మహారాజశ్రీ గుంటూరు 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
యం.వి.ఓ.పి.నెం.1314/2023

బిట్వీన్:
మందా సువర్ణ కుమారి వగైరాలు .....పిటీషనర్లు
మరియు
Mr అవంతిక లాజిస్టిక్స్, రిప్.బై మొగిలి షర్మిలా వగైరాలు ...రెస్పాండెంట్లు
టు,
ఆర్-1: Mr అవంతిక లాజిస్టిక్స్,రిప్.బై మొగిలి షర్మిలా, డోర్ నెం:16-265,గుల్లాపల్లి డొంక, పిడుగురాళ్ల మండలం, పల్నాడు జిల్లా-522413, (ఆర్.టి.సి బస్సు ఓనర్ ,నెం.AP 39 UL 0451)
ఆర్-3: జి.గోపి, తండ్రి.సుందర రావు, నివాస డోర్ నెం.1-151,బోదనం, బెల్లంకొండ,గుంటూరు జిల్లా. (ఆర్.టి.సి బస్సు డ్రైవర్, నెం.AP 39 UL 0451)

పై నెంబరు యం.వి.ఓ.పి.లోని పిటీషనర్లు యాక్సిడెంటుకు నష్టపరిహారం కొరుచూ దాఖలు చేసిన పిటీషనులో 1&3 వ రెస్పాండెంట్లు అయిన మీకు పై కోర్టువారి నుండి నోటీసులు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు నోటీసును ఈ పేపరు ప్రకటన ద్వారా తెలియజేయమని ది:06-05-2025కి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజున ఉ. గం.10-30 ని.లకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే చట్ట ప్రకారం మీ పరోక్షంగా విచారించి తీర్మానించ బడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:06-05-2025

ఐ.రాంబాబు,
పిటీషనర్లు తరపు అడ్వకేట్,
గుంటూరు.

నోటీసు
మహారాజశ్రీ గుంటూరు 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
యం.వి.ఓ.పి.నెం.495/2023

బిట్వీన్:
బండ్లమూడి అనిల్ కుమార్ @ అనిల్....పిటీషనరు
మరియు
టి.మదన్ వగైరాలు ...రెస్పాండెంట్లు
టు,
R-1: టి.మదన్, తండ్రి.శ్రీహరి, 309 చెంచుపేట, తెనాలి, గుంటూరు జిల్లా.
(ఫోర్డ్ ఫిగో ఓనరు,నెం.AP07BP 1144)

పై నెంబరు O.Pని పిటీషనరు యాక్షిడెంటులో తగిలిన గాయములకు నష్టపరిహారము కోరుచూ దాఖలు చేయగా సదరు పిటీషనులో 1వ రెస్పాండెంట్ అయిన మీరు కోర్టు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ వార్త పత్రిక ద్వారా మీకు తెలియజేయమని శ్రీ కోర్టు వారు ది:20-06-2025 కి వాయిదా వేసినారు. కావున ఆ రోజున ఉ.గం. 10-30 ని.లకు పైకోర్టు వారి ఎదుట స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హజరై మీకు గల ఆక్షేపణలు తెలుపు కొనవలెను. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది:20-06-2025

కె.శివప్రసాద్,
పిటీషనరు తరపు అడ్వకేట్,
గుంటూరు,సెల్: 9848119447

BEFORE THE MOTOR VEHICLE ACCIDENTS CLAIMS TRIBUNAL CUM II ADDL. DISTRICT JUDGE AND SESSIONS JUDGE AT VIJAYAWADA
M.V.O.P.No.46 of 2019

Between
Pathi Ranganayakulu and others
.... Petitioners
And
K.Naveen and another.
.... Respondents

Respondent No.1:
Kunapureddy Naveen, S/o Goapala Rao, D.No.15-14-45, 4 th lane, RTC Colony,Guntur, Guntur District.

Please take notice that the petitioners filed the petition for claiming compensation under Motor Vehicle Act and other reliefs and the petition stands posted on 13-06-2025 at 10-30 A.M. for your appearance either in person or to engage an Advocate. If you fail to attend before the Honorable Court on that day the matter will be decided in your absence.

(By the Honorable Court order)
Vijayawada, 18/04/2025.
M.Adinarayana Rao,
Advocate, Vijayawada-2.

గ్రామ చెరువు డి.నెం.203, చమళ్ళమూడి గ్రామం

వట్టిచెరుకూరు మండలం, గుంటూరుజిల్లా.

టెండరు ప్రకటన

గుంటూరుజిల్లా వట్టిచెరుకూరు మండలం, చమళ్ళమూడి గ్రామంలో వున్న గ్రామ చెరువు డి.నెం.203నకు సంబంధించిన ఈ దిగువ తెలిపిన పనులకు రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. సదరు పనికి టెండరు షెడ్యూళ్ళను ది. 26-4-2025 నుండి ది.2-5-2025 సాయంత్రం 4 గం.ల వరకు కార్యాలయ పనివేళలల్లో సదరు కార్యానిర్వహణాధికారి వద్ద పొందవచ్చును. టెండరు దరఖాస్తుతో పాటు టెండరు ధరావత్తు పైకము డి.డి. ద్వారా గాని, నగదు రూపంలో గానీ చెల్లించి రశీదు పొంది ఇందుతో జతపరచవలెను. పూర్తి చేసిన టెండర్లు ది. 3-5-2025 మధ్యాహ్నం 1 గం. వరకు స్వీకరించబడి అదేరోజు సాయంత్రం 4 గం.లకు హాజరైన కాంట్రాక్టర్ల సమక్షంలో సీల్డు టెండర్లు కార్యనిర్వహణాధికారి వారిచే తెరువబడును. పూర్తి వివరాల కొరకు చమళ్ళమూడి గ్రామ చెరువు కార్యాలయం నందు ఆఫీసు పనివదినములలో సంప్రదించగలరు.

వ.నెం.	పనిపేరు	అంచనావిలువ	టెండరు ధరావత్తు	టెండరు షెడ్యూలు ఖరీదు	పనిపూర్తి చేయు కాలం
1.	చిన్నచెరువు కట్టలు పటిష్టపరుచుట	5,00,000	5000	500	2 నెలలు

ప్రదేశము : చమళ్ళమూడి
తేది : 25-4-2025

ఇట్లు
సం॥ కార్యనిర్వహణాధికారి

మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

తెనాలి, కుంచనపల్లి, మంగళగిరిలలో మలేరియా అవగాహన ర్యాలీలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

ప్రజాశక్తి - తెనాలి

మలేరియా నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ ఇ. అన్నపూర్ణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి నుండి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ ఇ.అన్నపూర్ణ, మునిసిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆదేశాల మేరకు మలేరియా నిర్మూలనే లక్ష్యంగా 2008 నుంచి ప్రతి ఏటా ఏప్రిల్ 25ను ప్రపంచ మలేరియా దినోత్సవంగా పాటిస్తున్నామన్నారు. ఎంహెచ్ఓ డాక్టర్ కె.హెలెన్ నిర్మల మాట్లాడుతూ మలేరియా వ్యాప్తికి ఆడ ఎనాఫిలిస్ దోమ కాటే కారణమని, ప్రజలు దోమలు పుట్టకుండా కుట్టకుండా చూసుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా సహాయ మలేరియా అధికారి వంగల పున్నారెడ్డి, పట్టణ సబ్ యూనిట్ అధికారి ఎస్.ఉమాకాంత్, ఎ.బాల చంద్రమౌళి, వార్డ్ హెల్త్ సెక్రటరీస్, ఆశా కార్యకర్తలు, మలేరియా ఫైలేరియా సిబ్బంది, సెయింట్ పీటర్స్ నర్సింగ్ ఇనిస్ట్యూట్, జీవనజ్యోతి నర్సింగ్ కళాశాల విద్యార్థినులు శివాజీచౌక్ వద్ద మానవహారం నిర్వహించి, ప్రతిజ్ఞ చేశారు. సెయింట్ పీటర్స్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ కాకి సుమన్, ప్రిన్సిపల్ డి సునీత, అధ్యాపకులు ఎం.శ్రీకన్య, సంపూర్ణ సహకరించారు.

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కుంచన పల్లిలో ఆరోగ్య ఉప కేంద్రం వద్ద, డాక్టర్ నాగేంద్ర బాబు ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా మలేరియా నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలపై డాక్టర్ నాగేంద్రబాబు మాట్లాడారు. ఇంటి చుట్టుపక్కన నీరు నిలవ లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, ప్రజలు అప్రమత్తత కలిగి ఉండాలని ఆయన సూచించారు. అనంతరం ఆరోగ్య ఉప కేంద్రం సిబ్బందితో మలేరియా వ్యాధి జాగ్రత్తలపై ప్రతిజ్ఞను చేయించి, గ్రామంలో మలేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సూపర్వైజర్ శంకరరావు, ఏఎన్ఎంలు సుమలత, జ్యోతి, సుధా, శ్యామల, ల్యాబ్ టెక్నీషియన్ కఅష్ణారెడ్డి, ఆశా వర్కర్లు కె.శ్యామల, కె.భారతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక ఇందిరానగర్ యూపీహెచ్సీలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం యూపీహెచ్సీ ఆధ్వర్యంలో మలేరియా నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.అనూష ప్రారంభించారు. ఈ సందర్భంగా సిబ్బందిచే డాక్టర్ అనూష మలేరియా అంతం మనతోనే అంటూ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడారు. మలేరియా సోకకుండా పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సెంటర్ సిబ్బంది దిల్షా, వరలక్ష్మి, ధనలక్ష్మి, మలేరియా సిబ్బంది సాగర్, సైదులు, వాసు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - తుళ్లూరు

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. మలేరియాను అరికట్టేందుకు దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారులు డి.శ్రీనివాస్, ట.శివపార్వతి ప్రజలకు సూచించారు. దోమకాటుకు గురికాకుండా దోమతెరలు వాడాలన్నారు.కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కె.శేషగిరిరావు, సిహెచ్ఓ వెంకటరమణ, ఎం ఎస్ ఎం.రాణి, సూపర్ వైజర్లు డి.ఎస్. రెడ్డి, హెచ్ ఈ సుధాకర్, హెల్త్ అసిస్టెంట్స్ కరీం, లక్ష్మీనారాయణ, ఆశా కార్యకర్తలు, ఎ ఎన్ ఎంలు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - దుగ్గిరాల

దోమలు పుట్టకుండా కుట్టకుండా ప్రతి ఒక్కరు చర్యలు తీసుకోవాలని స్థానిక పిహెచ్సి వైద్యాధికారి షేక్ అబ్దుల్ రహమాన్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా కుట్టకుండా చర్యలు తీసుకోవాలన్నారు . పరిసరాలు నీరు నిల్వ ఉంచకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కుట్టకుండా దోమతెరలు శరీరం పూర్తిగా కప్పుకునే విధంగా వస్త్రాలు ధరించాలని తెలిపారు. కుట్టిన తర్వాత సకాలంలో వైద్యం చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సి ఇంద్ర సిబ్బంది జానమ్మ శ్రీనివాసరావు విమల తదితరులు పాల్గొన్నారు.

తుళ్లూరు, దుగ్గిరాలలో మలేరియా అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

హెచ్.పి.వి వ్యాక్సిన్ పై అవగాహన

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన డి3 శారద సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం బుర్రిపాలెం రోడ్ వివేకానంద సెంట్రల్ స్కూల్లో విద్యార్థులకు హెచ్పివి వ్యాక్సిన్పై అవగాహన కల్పించారు. ఆరోగ్యం పట్ల బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ డి శారద వివరించారు. వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రాయపాటి వీరనారాయణ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డాక్టర్ శారద పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హెచ్పివి వ్యాక్సిన్ ప్రయోజనాలు, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణలో వ్యాక్సిన్ పాత్రను 200 మంది విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా డి3 శారద సర్వీస్ సొసైటీ సేవలను వీర నారాయణరావు ప్రశంసించారు. కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత ఉమామహేశ్వర్, సొసైటీ వాలంటీర్స్, ఉపాధ్యాయ బఅందం, విద్యార్థినులు పాల్గొన్నారు.

గంధ మహోత్సవ ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి - పెదకాకాని

స్థానిక హజరత్ సయ్యద్ కరీముల్లాషా ఖాదరి బాబా వారి 16వ ఉరుసు గంధ మహోత్సవానికి అన్ని ఏర్పాటు పూర్తయ్యాయని వ్యవస్థాపకులు పటాన్ మహబూబ్ సుభాని తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శనివారం రాత్రి కంబల్ ఫాతేహా, ఆదివారం గంధం, సోమ వారం దీపారాధన జరుగునని తెలిపారు. కావున భక్తులు బాబా వారి అభివృద్ధికి సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

నియోజకవర్గాల విజన్ ప్రణాళికలు రూపొందించాలి

ప్రజాశక్తి - గుంటూరు

మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

స్వర్ణాంధ్ర - 2047కు అనుగుణంగా జిల్లాలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్రణాళికలను నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్లో ప్రణాళిక విభాగం ఆధ్వర్యంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్రణాళికను సిద్ధం చేయడంపై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ ఉద్యోగులకు (సీవీఏపీఎస్) శిక్షణ నిర్వహించారు. ఈశిక్షణలో కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 సాధన దిశగా అన్ని రంగాల్లో 15శాతం వృద్ధి సాధించే లక్ష్యంతో రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్ర , జిల్లా స్థాయిలో విజన్యాక్షన్ ప్లాన్ రూపొందించడం జరిగిందన్నారు. దానికి అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలోను స్థానిక శాసనసభ్యులను సమన్వయం చేసుకుంటూ విజన్ యాక్షన్ప్లాన్ రూపొందించాల్సి ఉందన్నారు. నియోజకవర్గంలోని అన్ని రంగాల వివరాలను సేకరించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా వఅద్ధికి అవకాశం ఉన్న రంగాల్లో నూతన ప్రాజెక్టుల ఏర్పాటుకు యాక్షన్ప్లాన్ రూపొందించడంతో పాటు వాటిని సక్రమంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాల గురించి తెలియజేయా లన్నారు. నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్రణాళికలు రూపొందించటంలో పరిగణలోకి తీసుకోవాల్సిన అంశాలపై ప్రణాళిక విభాగం డైరెక్టర్ రాంబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా శిక్షణ అందించారు. కార్యక్రమంలో సిపిఓ శేషశ్రీ, ప్రణాళిక విభాగం సలహాదారు సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

మండలంలో సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - దుగ్గిరాల

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

మండలంలో ఉన్న సమస్యలు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని అవి పరిష్కరించేందు కుకృషి చేస్తామని ఎంపీపీ షేక్ జబీన్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోడ్లు, డ్రెయినేజి వ్యవస్థ, అంగన్వాడీ పాఠశాల భవనాలు తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లమని మంత్రి సానుకూలంగా స్పందించి చింతలపూడి రేవేంద్రపాడు గ్రామాల మధ్య రోడ్డు వేయించారని మిగిలిన సమస్యలు కూడా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు తమ తమ శాఖకు సంబంధించిన అంశాలను ప్రస్తావించారు. దుగ్గిరాల పిఎస్సి వైద్యాధికారి డాక్టర్ ఇజాస్ అహ్మద్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, పెదపాలెం గ్రామానికి చెందిన వెటర్నరీ డాక్టర్ సురేష్, మండల వ్యవసాయ అధికారి ఈ శిరీష పలు సమస్యలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఎం అరుణ ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు సూపరిటెండెంట్ చంద్రమోహన్ ఏపిఎం జి సురేష్ ఈమని వైద్యాధికారి రహీమున్నీసా, ఎంఈఓ కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మేయర్ ఎన్నికపై టిడిపి నేతల రహస్య భేటి

26 మంది కార్పొరేటర్ల హాజరు - మరో ముగ్గురు వ్యక్తిగత కారణాలతో గైర్హాజరు

తమ బలం 33 అంటున్న నేతలు- వైసిపి బలం 28నేని స్పష్టం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్ మేయర్ పదవికి ఈనెల 28న జరగనున్న ఎన్నికపై వ్యూవరచన చేసేందుకు టిడిపికి చెందిన ప్రజా ప్రతినిధులు శుక్రవారం రాత్రి స్థానిక బృందావన్ గార్డెన్స్లోని ఒక హోటల్లో రహస్య సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 3న జరిగిన స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వ్యవహరించిన విధంగానే ఈ ఎన్నికల్లో కూడా కూటమి కార్పొరేటర్లు అంతా ఐకమత్యంగా వ్యవరించాలని నిర్ణయించారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ సోదరుడు పెమ్మసాని రవి నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, నశీర్ అహ్మద్, బి.రామాంజనేయులు, మేయర్ అభ్యర్థి కోవెలమూడి రవీంద్ర, టిడిపి, జనసేన కార్పొరేటర్లు 26 మంది హాజరు అయ్యారు. ఇంకా ముగ్గురు కార్పొరేటర్లు వ్యక్తిగత పనుల వల్ల హాజరు కాలేకపోయారని పార్టీ నాయకులు తెలిపారు. ప్రస్తుతం 29 మంది కార్పొరేటర్లు టిడిపి, జనసేనకు ఉన్నారని ఇంకా కొంతమంది తమకు మద్ధతు పలుకుతారని వైసిపి పోటీ చేసినా తమదే విజయం అని పలువురునాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఎక్స్ అఫిషియో సభ్యులు కలిపి మొత్తం 33 మంది ఉన్నట్టు అంచనా వేస్తున్నారు. వైసిపి పోటీ చేసినా ఇబ్బంది లేదని గెలుపు తమదేనని ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. పార్టీ అధిష్టానం ఆదేశం మేరకు కోవెలమూడి అభ్యర్థిత్వాన్ని ప్రతి ఒక్కరూ బలపర్చాలన్న పెమ్మసాని రవి తెలిపారు. ఈమేరకు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఇదిలా ఉండగా వైసిపి నుంచి ప్రస్తుతం 26 మంది కార్పొరేటర్లు ఉండగా వీరిలో ఎంత పూర్తిగా పార్టీ ప్రతిపాదించిన అభ్యర్థికి ఓట్లు వేస్తారన్న అంశం చర్చనీయాంశంగా మారింది. 26 మంది కార్పొరేటర్లతోపాటు ఇద్దరు ఎమ్మెల్సీలు కలిపి వైసిపి బలం 28 ఉన్నట్టు తెలుస్తోంది. టిడిపి బలం 33 ఉండటం వల్ల టిడిపి అభ్యర్థి కోవెలమూడి ఎన్నిక సునాయసనం అవుతుందని ఆ పార్టీ నాయకులు ధీమా వ్యక్తం చేశారు.

143 రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి: తమకు న్యాయంగా రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి143 రోజులకు చేరుకున్నాయి. దీక్షల్లో ఎ.విజయశ్రీ, యు.కాశమ్మ, ఇ. దుర్గాభవాని, టి.చరిత్ర శ్రీ దివ్య, ఈ సార మ్మ, డి.మల్లేశ్వరి కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కె.ఆశీర్వాదం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు.

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

ప్రజాశక్తి - మంగళగిరి

గంజాయి విక్రయించిన సేవించిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంగళగిరి పట్టణ సీఐ డి వినోద్ కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మంగళగిరి పట్టణ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మంగళగిరి పట్టణ పరిధిలో గంజాయి విక్రయిస్తూ మరియు సేవిస్తూ నట్లు వచ్చిన సమాచారం మేరకు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు నార్త్ సబ్ డివిజన్ డిఎస్పి మురళీకఅష్ణ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం అజయ్ నగర్ ప్రాంతంలో ఇద్దరు ముద్దాయిలు ఒక స్కూటీపై గంజాయి సేవించి విక్రయిస్తు పోలీస్ వారి రాక చూసి తప్పించుకొనుటకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న స్కూటీని తనిఖీ చేయగా డిక్కీలో ఉన్న 250 గ్రాముల గంజాయిని, స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలైన గాజుల వర్తి సన్నీ పాల్, పాటిబండ్ల జాషువా లను విచారించగా వారు పవన్, మణికంఠ అను ఇద్దరు వ్యక్తుల నుండి కొనుగోలు చేసి అమ్ముతున్నట్లు వారు తెలిపారని సిఐ వినోద్ చెప్పారు. ముద్దాయిలను న్యాయస్థానం ముందు హాజరు పరచనున్నట్లు సిఐ వినోద్ కుమార్ తెలిపారు.

1 నుండి ఎన్‌టిఆర్ స్టేడియంలో వేసవి శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

జిఎంసి ఎన్టిఆర్ మున్సిపల్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్ సొసైటీ ఆధ్వర్యంలో మే 1వ తేదీ నుండి 31వ తేదీ వరకూ సమ్మర్ కోచింగ్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న 14 ఏళ్లలోపు బాల బాలికలు స్టేడియం, స్విమ్మింగ్ పూల్‌లో శనివారం నుండి అందుబాటులో ఉండే దరఖాస్తులను పూర్తి చేసి ఇవ్వాలని కోరారు. ప్రతిరోజు ఉదయం 6 నుండి 8 గంటల వరకు, సాయంత్రం 5:30 నుండి 7 గంటల వరకు క్యాంప్ జరుగుతుందన్నారు. క్యాంప్‌లో అథ్లెటిక్స్, బాస్కెట్‌బాల్, స్కేటింగ్, టెన్నిస్, షటిల్ బ్యాడ్మింటన్, చెస్, యోగా, ధ్యానం, టేబుల్ టెన్నిస్, స్విమ్మింగ్ అంశాల్లో శిక్షణ ఇస్తారన్నారు. నెల రోజుల శిక్షణ అనంతరం జరిగే క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్లు, బహుమతులు అందిస్తామని తెలిపారు.

తెనాలి అభివృద్ధికి పక్కా ప్రణాళిక

ప్రభుత్వం నుంచి రూ.10 కోట్లు మంజూరు - త్వరలో పురపాలక సంఘ నూతన భవన నిర్మాణం

మున్సిపల్ అధికారుల సమీక్షలో మంత్రి మనోహర్ వెల్లడి

ప్రజాశక్తి - తెనాలి

రోడ్డు విస్తరణకు శంకుస్థాపనలో మంత్రి మనోహర్

పట్టణ అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా వ్యవహరించనున్నట్లు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం నుంచి రూ. 10 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న పురపాలక సంఘ నూతన భవనం పబ్లిక్, ప్రైవేట్ భాగస్వామ్యంతో భవనాన్ని నిర్మించనున్నామని, మే నెలాఖరు నాటికి కార్యాలయాన్ని తాత్కాలికంగా మహాత్మా గాంధీ మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్‌లోకి తరలించనున్నట్లు చెప్పారు. అదేవిధంగా పట్టణంలో వీధి కుక్కల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై కమిషనర్, ఛైర్ పర్సన్ చర్చించామన్నారు. తడి చెత్త పొడి చెత్త సేకరణలో నూతన విధానాల అమలుకు రూ. 4 కోట్ల నిధులతో యంత్రాలు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. పట్టణంలో తాగునీటి సరఫరా లో ఇబ్బందులు తొలగించేందుకు కార్యాచరణ రూపొందించామని, చినరావూరు పార్కును అభివృద్ధి చేసిన రీతిలో, ఐతానగర్లోని ఫైకస్ పార్కును కూడా జూలై నాటికి ప్రజలకు అంకితం చేయనున్నట్లు వెల్లడించారు. మే ఒకటి నుంచి నెలాఖరు వరకు పారిశుధ్యం మెరుగుకు కార్యక్రమాలు చేపట్టామని, 17న నిర్వహించే స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో అన్ని విభాగాల అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొనాల్సిందిగా కోరారు. సమావేశంలో ఛైర్ పర్సన్ తాడి బోయిన రాధిక, కమిషనర్ బి శేషన్న, ఎంహెచ్ఓ డాక్టర్ కె హెలెన్ నిర్మల, ఆర్వో రాంప్రసాద్, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, మెప్మా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మంత్రి మనోహర్ పట్టణంలో 31 వ వార్డులో రూ 40 లక్షలతో ప్రతిపాదించిన సిసి డ్రైన్ నిర్మాణానికి, రూ.39.20లక్షలతో ప్రభుత్వ వైద్యశాల రోడ్డుకు, రూ 40 లక్షలతో బుర్రిపాలెం రోడ్డు దక్షిణం వైపు విస్తరణకు, ఎనిమిదవ వార్డులోరూ.32 లక్షలతో ప్రతిపాదించిన షాపింగ్ కాంప్లెక్స్ కు శంకుస్థాపన చేశారు.

పింఛనుదారులను గౌరవించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

పింఛన్ లబ్ధిదారుల్ని గౌరవిస్తూ పింఛన్లు పంపిణీ చేపట్టాలని, ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆదేశించారు. ఐవిఆర్ఎస్ నివేదిక ఆధారంగా జనవరి నుండి ఏప్రిల్ వరకూ నాలుగు నెలలో జరిగిన పింఛన్ల పంపిణీలో అవినీతి, ప్రవర్తనకు సంబంధించిన ప్రశ్నలపై మూడుసార్లు ప్రస్తావించబడిన పించను పంపిణీ సిబ్బందికి శుక్రవారం కలెక్టరేట్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పింఛన్‌దారులకు ఇంటివద్దనే పింఛన్ పంపిణీ చేయాలని, వారితో మర్యాదపూర్వకంగా, గౌరవంగా మాట్లాడాలని అన్నారు. కౌన్సిలింగ్‌కు హాజరు కాని సిబ్బందికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.వి.విజయలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

పదో తరగతి ఫలితాల్లో శ్రీవిద్య హైస్కూల్ విజయఢంకా

ప్రజాశక్తి-గుంటూరు

పదవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో గుంటూరు, సంతోష్ నగర్‌లోని శ్రీవిద్య హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని స్కూల్ డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ విద్యార్థులు జి.కౌసల్య 556 మార్కులు, వై.అక్షయ 554 మార్కులు, పి.వినీల 551 మార్కులు, సిహెచ్.సాయిచరణ్ 543, డి.లక్ష్మీనారాయణ 538, కె.సాయిశశిధర్ 534, షేక్.షాహినా 520 మార్కులు సాధించారని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. మంచి మార్కులు సాధించడానికి కృషిచేసిన ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడాకారులతో సిఐటియు రాష్ట్ర, జిల్లా నాయకులు

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎవి నాగేశ్వరరావు

మేడే సాంస్కృతిక, క్రీడా ఉత్సవాలు జయప్రదం చేయండి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు

సిఐటియు ఆధ్వర్యంలో నాగార్జున వర్సిటీలో క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎఎన్‌యు

మే డే సందర్భంగా ఉద్యోగ, కార్మికుల క్రీడా సాంస్కృతి ఉత్సవాల ద్వారా వారోత్సవాలు జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో సిఐటియు గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎవి నాగేశ్వరరావు మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా మేడేను క్రీడ, సాంస్కృతిక ఉత్సవాల ద్వారా ఎనిమిది గంటల పని విధానం, మే 20న సమ్మె డిమాండ్లను ప్రచారం చేయడం కోసం మేడే వారోత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా సిఐటియు నిర్వహిస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నేడు తూట్లు పొడుస్తున్నాయని అన్నారు. నేడు కార్మిక వర్గం వారానికి 90 గంటల పని చేయాలని 72 పని చేయాలని రకరకాల కార్పొరేట్ శక్తులు విధానాలు వినిపిస్తున్నాయని దీనికి భిన్నంగా ఐయల్ఓ సైతం 36 గంటలు మాత్రమే పనిచేయాలని తీర్మానం ఉందని అన్నారు. కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పని గంటల్లో మార్పులు తెచ్చి కార్మికుల శ్రమను దోచుకునే దుకు ప్రయత్నిస్తున్నాయని ఇది సరైంది కాదన్నారు. ప్రభుత్వ సంస్థల పరిరక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని ఆంధ్ర రాష్ట్రానికి తలమానికైనటువంటి విశాఖ ఉక్కు లాంటివి అమ్మేందుకు సిద్ధమవుతున్నారని దీనికి వ్యతిరేకంగా ప్రభుత్వంగా పరిరక్షణ కోసం సిఐటియు కృషి చేస్తుందన్నారు. 8 గంటల పనిలో ఎటువంటి మార్పులు లేకుండా ఉండేందుకు మే డే స్ఫూర్తితో మే 20న జరగనున్న జాతీయ సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్కీం వర్కర్లు, కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్, డైలీ వేజ్ ఇతర పేరులు ఏమైనప్పటికీ అతి తక్కువ వేతనాలతో కార్మికుల శ్రమను ప్రభుత్వమే దోచుకోవటం జరుగుతుందన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కనీస వేతనం రూ.26000 కనీస పెన్షన్ రూ.9000 ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక వర్గం వివిధ రకాల డిమాండ్లు పరిష్కారం కోసం మే 20వ తారీకు సమ్మె నిర్వహించబోతున్నామని దీనికి ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడా నిర్వాహకులకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి లక్ష్మణరావు, దండా లక్ష్మీనారాయణ, సిఐటియు గుంటూరు నగర ప్రధాన కార్యదర్శి బి ముత్యాలరావు, యూని వర్సిటీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కే భాను ప్రసాద్, ఏ శివ ప్రసాద్, సిహెచ్ గోపాలకృష్ణ ప్రసాద్, రమణ, ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ అధ్యక్షులు కె రూఫస్ తదితరులు పాల్గొన్నారు. మొదటి మ్యాచ్ గుంటూరు మిర్చి కింగ్స్ పై రాజు ఏఎన్యూ టీం విజయం సాధించింది. రెండవ మ్యాచ్ జిఎంసి వారియర్స్ వర్సెస్ సిఆర్ డి సర్కిల్ ఎలక్ట్రిసిటీ మ్యాచ్ జరుగుతుంది.

హైబిపి పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న ఎంటి కృష్ణబాబు

బిపి, షుగర్, మానసిక ఒత్తిడి, ఆల్కహాల్ తీసుకోవటం వల్ల బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు అన్నారు. కుటుంబ యజమాని బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడటం వల్ల ఆయా కుటుంబాలు విచ్చిన్నం అవుతున్నాయన్నారు. ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, రోటరీ క్లబ్ సంయుక్తంగా స్థానిక భారతీయ విద్యాభవన్‌లో 'చెక్ బీపీ- స్టాప్ స్ట్రోక్' అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణబాబు మాట్లాడుతూ దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరికి షుగర్, ప్రతి నలుగురిలో ఒకరికి బిపి ఉన్నాయన్నారు. ప్రభుత్వం తరపున ప్రతి ఒక్కరికీ బిపి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, మందులు ఇవ్వటం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఇలాంటి అవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ఐఎస్ఎ, రెడ్‌క్రాస్, రోటరీ క్లబ్ సంస్థలను అభినందించారు. ఐఎస్ఎ అధ్యక్షులు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ విజయ 'హైపర్ టెన్షన్, స్ట్రోక్' అనే అంశంపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. దేశంలో ప్రతి నిముషం ముగ్గురికి బ్రెయిన్ స్ట్రోక్ వస్తోందని, ప్రతి ఏడాది 18 లక్షల మంది బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతున్నారని చెప్పారు. అందులో 25 శాతం మంది 40 ఏళ్ల వయస్సులోపు వారేనని అన్నారు. స్ట్రోక్‌పై అవగాహన ద్వారా 80 శాతం వరకూ నివారించొచ్చని అన్నారు. హైబిపి మౌన వ్యాధి అని, చాలా మందికి బిపి ఉన్నట్లు తెలియట్లేదన్నారు. 18 సంవత్సరాలు నిండిన వారు బిపి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐఎస్ఎ కార్యదర్శి డాక్టర్ అరవింద్ శర్మ ప్రసంగించారు. ఈ సందర్భంగా మొబైల్ బిపి పరీక్షల బస్సును ఎంటి.కృష్ణబాబు జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, జిజిహెచ్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ యు అరుణకుమారి, న్యూరాలజిస్ట్ భార్గవి, డాక్టర్ బిందు నర్మద పాల్గొని అవగాహన కల్పించారు. అనంతరం నగరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించి, దాదాపు వెయ్యి మందికి బిపి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ విజయ, రెడ్‌క్రాస్ ట్రెజరర్ పి.రామచంద్రరాజు, రోటరీ క్లబ్ రవి వడ్లమాని, రోటరీ అధ్యక్షులు జి.సుబ్బారావు, నగరంలోని ప్రముఖ న్యూరాలజిస్టులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో ఉచిత బిపి పరీక్ష నిర్వహిస్తున్న డాక్టర్ యు అరుణకుమారి

పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా ఆర్‌విఆర్ జెసిలో శాంతిర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

జమ్మూ కాశ్మీర్‌లో పహల్గాం ఉగ్రదాడి, భారత దేశాన్నే కాకుండా యావత్ ప్రపంచ దేశాలను కలచివేసిన తీవ్ర విషాద ఘటన అని ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజి అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జె.మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని పేర్కొన్నారు. పహల్గాం ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడిని ఖండిస్తూ శుక్రవారం చౌడవరంలోని ఆర్‌విఆర్ అండ్ జెసిలో అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది శాంతిర్యాలీ నిర్వహించారు. మృతులకు నివాళి అర్పిస్తూ కొవ్వొత్తులు వెలిగించారు. కార్యక్రమంలో సెక్రెటరీ రాయపాటి గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు